జనరాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 2   సంచిక - 20   పక్షపత్రిక   అక్టోబర్16-31, 2011






# THE GUNTUR CO-OPERATIVE URBAN BANK LTD., GUNTUR

3rd Line,Brodipet,Guntur -522 002. PH NO.0863-2230737

**The bank is running with 8 branches on sound lines.**

| | | (Rs. In Lakhs) 30.09.2011 |
|---|---|---|
| Deposits | : | 11803.80 |
| Advances | : | 8243.81 |
| Share Capital | : | 273.12 |

- Pays higher interest Deposits than other banks
- DD/Pay Order facility available.
- 0.50% extra interest on Deposits for senior Citizens .
- All Deposits are insured at DICGC,Mumbai.
- Locker facility available .

| | |
|---|---|
| **Sri. Kothamasu Srinivasa Rao,**<br>Chartered Accountant | **Chairman** |
| **Sri. Attimalla Venkata Ratnam** | **Vice-Chairman** |
| **Sri.G. Siva Rama Krishna Prasad**<br>Chartered Accountant | **Director** |
| **Sri. Adapa Koteswara Rao** | **Director** |
| **Sri. Yadavalli Nageswara Rao** | **Director** |
| **Sri Golla Narayana Murthy** | **Director** |
| **Sri.G.Y.N. Babu** | **Director** |
| **Sri Jagarlamudi Srinivasa Rao** | **Director** |
| **Sri MD.Babu** | **Director** |
| **Sri Marreddy Basivi Reddy** | **Director** |

# లోక్‌సత్తా పార్టీ 5వ వార్షికోత్సవ దృశ్యాలు






















## నాయకత్వ సదస్సు దృశ్యాలు











జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక అక్టోబరు16-31,2011

సంపుటి - 2 సంచిక - 20

## లోపలి పేజీల్లో...

అద్వానీ మనోరధం నెరవేరేనా? .......... 7

సమాచార హక్కు చట్టానికి ఆరేళ్ళు ..... 9

దారిసిద్ధం... ఇక సంసిద్ధం కావాలి.... 11

వ్యవస్థ మార్పు కోసం ఉద్యమిద్దాం... రండి..18

లోక్‌సత్తా పార్టీ రాజకీయ తీర్మానం...... 20

ఆదివాసీల స్వేచ్ఛాగీతం కోమరం భీం.... 23

సిసలైన హైదరాబాదీ... గౌర్................ 25

రాష్ట్రంలో మానవాభివృద్ధి ఆగింది......... 28

మద్యం మత్తులో జనం........................ 30

కొత్తతరం నాయకత్వానికి ప్రతీక.......... 31

లోక్‌సత్తా పార్టీ ఉద్యమవార్తలు........... 33

లోక్‌సత్తా సాహిత్యం.......................... 36

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# గనుల చట్టం 'ఘనులకు' చుట్టం కారాదు

## సంపాదకీయం

గనులలో ఘనుల కుంభకోణాలు వెల్లువెత్తుతున్నాయి. దేశ సంపదను దారిదోపిడీ చేస్తున్నారు. అక్రమార్కులు కోట్లకు పడగలెత్తుతున్నారు. పాలననీ, రాజకీయాన్ని అవినీతిమయం చేస్తున్నారు. నిర్వాసితుల్ని గాలికొదిలేస్తున్నారు. ప్రజలకు వినియోగపడాల్సిన సొత్తు పరాన్న భుక్కుల పరమౌతున్నది.

గనులు ఖనిజాల అభివృద్ధి నియంత్రణ 1957 చట్టం వున్నాలేనిది అయింది. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం మరో కొత్త చట్టాన్ని 2011 సెప్టెంబరులో ఆమోదించి పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి సిద్ధం చేసింది. ఈ బిల్లు గతానికంటే మెరుగైంది. గనుల తవ్వకాల లాభాలలో నిర్వాసితులకు వాటాను కల్పించనుంది. పర్యావరణ పరిరక్షణ చర్యలను పకడ్బందీ చేయనుంది. ప్రస్తుత లైసెన్సు పద్ధతిని మార్చనుంది. పోటీ వేలంపద్ధతి ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాన్ని పెంచడానికి వీలు కల్పిస్తుంది. పర్మిట్లు ఇచ్చేటప్పుడు మరింత పారదర్శకత పాటించే వీలుంది. అలాగే అక్రమార్కులపై కేసులు విచారించడానికి ప్రత్యేక కోర్టులకు వీలు కల్పించింది. ఇవన్నీ ఆహ్వానించదగ్గ అంశాలు.

కాని అసలు సమస్య రాష్ట్రాల చుట్టూ అల్లుకుని వుంది. తమ సరిహద్దుల లోపల వున్న గనులు, ఖనిజాలపై అధికారం పూర్తిగా రాష్ట్రప్రభుత్వాల పరిధిలో వుంది. వాటికి అనుమతులు, లైసెన్సులు వారే మంజూరు చేస్తారు. చట్టవిరుద్ధంగా సాగించే అక్రమ మైనింగ్‌ను నిరోధించడం రాష్ట్రాల వంతు అయింది. ఈ అక్రమాలను అడ్డుకోడానికి 1957 చట్టం రాష్ట్రాలకు అధికారాలను ఇచ్చింది. కాని రాష్ట్రాలు దానిని వినియోగించడం లేదు. పైగా అక్రమార్కులతో చేతులు కలుపుతున్నాయి. అవినీతికి మార్గాలుగా, సాధనలుగా గనులను తవ్విస్తున్నాయి.

2009 సంవత్సరంలో 41,578 అక్రమమైనింగ్ కేసులు నమోదు కాగా 2010 సెప్టెంబరునాటికీ 43,317 కేసులు నమోదైనట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. కర్నాటకలో, గోవాలో, ఆంధ్రప్రదేశ్‌లో మనం చూస్తున్న భాగోతాలు దీనికి దర్పణం పడుతున్నాయి. ఈ అక్రమార్కులు రాష్ట్ర ప్రభుత్వాలను తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. ప్రతి పక్షాలను లోబర్చుకుంటున్నారు. ప్రజలకు తాత్కాలిక తాయిలాలు ఇచ్చి శాశ్వతంగా దోచుకుంటున్నారు.

దీనిని అదుపుచెయ్యడానికి కొత్త చట్టంలో అదనంగా తీసుకున్న చర్యలు లేవు. రాష్ట్రాల పరిధి పేరుతో దీనిని ఉపేక్షిస్తే కొత్త చట్టం వల్ల పరిమితమైన ప్రయోజనం మాత్రమే దక్కుతుంది. కేంద్రప్రభుత్వం ఈ అక్రమాలకు అడుకట్ట వెయ్యడానికి ఒక సమన్వయ, సాధికార కమిటీ వెయ్యలని రాష్ట్రాలకు సూచించింది. దీనిలో రైల్వేలు, పోర్టులు, కష్టమ్స్ ప్రతినిధులు వుండాలని సూచించింది. దీనివల్ల ఖనిజాల అక్రమ రవాణాని, ఎగుమతుల్ని నిరోధించడానికి వీలుపడుతుందని సూచించింది. కాని రాష్ట్రాలు మాత్రం దీనిమీద స్పందించడం లేదు. అందుచేత కొత్తచట్టం కూడా గనులలో "ఘనుల"కు చుట్టం అయ్యేలా కనిపిస్తున్నది. దీనిని చక్కదిద్దడానికి తక్షణ చర్యలు అవసరం. ■




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
*ఇం.నం. 5–10–180/ఎ&ఎ1,*
*బ్యాండ్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,*
*హైదరాబాద్ – 500 004,*
*ఫోన్: 040–2323 1818*
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: 040-2323 1818.*
*సెల్ : 80085 07934*

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# అద్వానీ మనోరథం నెరవేరేనా?

అద్వానీ జన చేతన యాత్ర సాగే కొద్దీ అనుమానపు తెరలు పంటాపంచలు కాకపోగా మరింత పెరుగుతున్నాయి. కేంద్రంలో పాలన పట్ల నిరాశతోవున్నా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికే ఈ యాత్రసాగిస్తున్నట్లు, ఈ యాత్ర తన స్వప్రయోజనాల కోసం కాదని పదేపదే ప్రకటిస్తున్నా అనుమానాలు మరింత ముసురుతున్నాయే తప్ప తొలగడం లేద.

బి.జె.పి. పార్టీలో ప్రధాని పదవిని ఆశించడం లో అద్వానీది అత్యాశగా భావించడానికి వీలులేదు. ఆయనది సుదీర్ఘ రాజకీయ జీవితం, వ్యక్తిగతంగా అధికారంలో వున్నప్పుడు, లేనప్పుడు ఆయన మీద అవినీతి ఆరోపణలు లేవు. బి.జె.పి.కి ఆయన ఒక మూలస్తంభం ఆయన మతవాద రాజకీయానికి ప్రతినిధిగా పేరు తెచ్చుకున్నా, ఆ పార్టీ గెలుపులలో ఆయన ప్రధాన పాత్రధారిగా వున్నారు. అయితే బి.జె.పి. ఒంటరిగా అధికారంలోకి రాగల స్థితి లేనందువల్ల, మిత్రకూటమికి ఆమోదయోగ్యమైన ప్రధాని అభ్యర్థి తప్పనిసరి అయింది. అక్కడే ఆయన మతఛాందసవాద ముద్ర అడ్డం తగిలింది. ప్రధాని పదవికి ఆయనను దూరం చేసింది.




ఇప్పుడు బి.జె.పి ప్రధాని అభ్యర్థిగా ముందుకొస్తున్న మోడీ పరిస్థితి కూడా ఇదే. ఆయన అభివృద్ధి విధానాలను అందరూ ఆమోదిస్తున్నారు. కానీ గుజరాత్ అల్లర్లలో, ఊచకోతలో ఆయనపాత్రని ఎవరూ జీర్ణించుకోలేక పోతున్నారు.

మరో పక్క బి.జె.పి. ఒకరాజకీయ పార్టీగా వున్నా దానికి ఆర్.ఎస్.ఎస్. రిమోట్ కంట్రోలుగా వుంది. ఆ పార్టీలో కీలక బాధ్యతల ఎంపిక, పదవుల ఎంపికలో అంతిమ నిర్ణయం ఆ పార్టీది కాకపోగా ఆర్.ఎస్.ఎస్.దే కావడం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఆ పార్టీ అధ్యక్షుడుగా వున్న గడ్కరీ ఎంపిక ఆ పార్టీ వాళ్లు కూడా ఊహించింది కాదు. ఈ పేరు బి.జె.పి పార్టీలో కూడా చాలా మందికి తెలియదు. అయినా ఆర్.ఎస్.ఎస్ సూచించింది. ఈ పార్టీ నేతలు ఆమోదించారు. ఇలాంటి నేపథ్యాల మధ్య అద్వానీ ఆశిస్తున్న ప్రధాని పదవి ఎటు మొగ్గుతుందో తెలియని స్థితి వుంది.

అద్వానీ యాత్ర నిస్సందేహంగా ప్రధాని పదవి చుట్టూ ప్రారంభమైంది. ఒక పక్క కేంద్రప్రభుత్వం అవినీతి కుంభకోణాలలో చిక్కుకోవడం, మరొకపక్క అన్నాహజారే దీక్షకు మధ్యతరగతి వర్గాలలో పెల్లుబికిన అసంతృప్తిని తన పార్టీకి తనకు సానుకూలంగా మల్లించుకోవాలని అద్వానీ భావించారు. ఈయాత్రను తనంతటతానుగా ప్రకటించి ఈ ఉద్యమానికి కేంద్ర బిందువు కావాలని తలపోశారు. అయితే ఈ ప్రకటన బి.జె.పి.లో ప్రకపంనాలు సృష్టించింది. మోడీ వర్గీయులు దీనిని వ్యతిరేకించారు. పార్టీ నోరు విప్పని స్థితిలో పడింది. ఆర్.ఎస్.ఎస్. తన ప్రతికూలతను బహిరంగంగానే వ్యక్తీకరించింది. దీనికితోడు మోడీ వెంటనే తన సద్భావన దీక్షను ప్రకటించాడు. ఆ పార్టీ జాతీయ నాయకులచేత పొగడ్తలు, భావి ప్రధాని అన్న ప్రకటనలు సాధించుకున్నాడు. అద్వానీని రేసులో వెనక్కి నెట్టారు.

అద్వానీ యీ ఎదురు దాడితో ఆత్మరక్షణలో పడ్డారు. తర్వాత తన యాత్రకు పార్టీలో ఆమోదముద్ర వేయించుకున్నారు. ఆర్.ఎస్.ఎస్. నేతలతో మంతనాలు జరిపి ప్రధాని అభ్యర్థి ప్రస్తావనకు దూరంగా వుండే షరతులమీద వారి అంగీకారాన్ని సంపాదించుకున్నారు.

అద్వానీ గత యాత్రలకీ దీనికి స్పష్టమైన తేడా వుంది. గతంలో యాత్రలు మతపరమైన అంశాల చుట్టూ తిరిగాయి. అలాంటి పుణ్యక్షేత్రాల చుట్టూ తిరిగాయి. అవి తన పార్టీకి బలాన్ని చేకూర్చినా ఆయనను వివాదస్పదుణ్ణి చేశాయి. ఈ యాత్ర పూర్తిగా సెక్యులర్ యాత్ర. అవినీతి నల్లధనంపై జన చేతన యాత్ర. అందుకే అద్వానీ తన యాత్రను లోకనాయక్ జయప్రకాష్ నారాయణ్ జన్మస్థలం నుండి ఆయన పుట్టినరోజు అక్టోబర్ 11న దీనిని ప్రారంభించారు.

ఈ యాత్రలలో అయోధ్యలు, సోమనాధ్ దేవాలయాలు లేవు. ఈ యాత్ర ద్వారా రెండు ఫలితాలను సాధించాలని ఆయన తలపోశారు. ఒకటి కాంగ్రెస్ అవినీతి పాలనకు పెల్లుబికిన అసంతృప్తిని రాజకీయంగా మూటగట్టుకోవడం. రెండోది తను బి.జె.పి.లోనే కాకుండా దాని మిత్రపక్షాలలో కూడా ఆమోదయోగ్యమైన స్థితి తెచ్చుకోవడం ఎలాంటి వివాదాలూ లేకుండా ఇది సాగివుంటే ఈ యాత్ర ఆయనకు ఉపకరించేది. ఇప్పుడు యీ యాత్ర తన స్వప్రయోజనాలకు కాదని పదే పదే చెప్పుకోవలసి వచ్చింది. అయినా ఈ యాత్రలో పాల్గొన్న ఉమాభారతి మాట్లాడుతూ అద్వానియే ప్రధాని అభ్యర్థి అని చెప్పడం మరోసారి అద్వానీని ఇరకాటంలో పెట్టింది. అయితే ఈసారి అద్వానీ తాను ప్రధాని రేసులో లేనని స్పష్టం చేస్తూనే ఎన్నికల సందర్భంలో తమ పార్టీ చర్చించి ప్రధాని అభ్యర్థిని నిర్ణయిస్తుందన్న చిన్న మెలికతో ప్రకటించారు.

దీనికి తోడు బి.జె.పి. సీనియర్‌నేత యస్వంత్‌సిన్హా మాట్లాడుతూ తనతోసహా పలువురు ప్రధాని పదవికి సమర్థులైనవారున్నారని ప్రకటించారు. మొత్తంమీద బి.జె.పి.కి ఒక పక్క తాము అధికారంలో వున్న రాష్ట్రాలలో అవినీతి బయట కొస్తుంటే మరోపక్క ప్రధాని పదవీజ్వరం కూడా పట్టుకుంది.

ప్రధాని పదవికోసం ఇన్నేళ్ల అద్వానీ మనోరథం ఈ రథయాత్రతోనైనా ఫలించే అవకాశాలు మూసుకుపోతున్నాయి. ఈసారి అద్వానీకి మిత్రపక్షాల కూటమి నుండి కాకుండా స్వంత పార్టీ నుండే ప్రతిఘటన రావడమే విషాదం. ■

**- సవ్యసాచి**


# ఈ పుస్తకం కొనాలంటే..

**లోక్‌సత్తా పార్టీకి ఒకే ఒక్క శాసనసభ్యుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ శాసనసభ సమావేశాలే అంతంతమాత్రంగా జరుగుతూఉన్నాయి. అందులో ఒకే సభ్యుడు ఉన్న పార్టీకి ఇచ్చే సమయం బహుస్వల్పం తక్కువ సమయంలో కూడా అత్యంత ప్రతిభావంతమైన ప్రసంగాలను ఆయన చేశారు. సభని ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రజల్ని ఆలోచింపజేస్తున్నారు.**

**ఈ విలువైన ప్రసంగాలను అందరికీ అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో లోక్‌సత్తా పార్టీ ప్రచురించింది. అదొక అపురూపమైన పుస్తకం. ఒంగోలులో పుస్తకావిష్కరణ జరిగిన రోజునే 1000 కాపీలు హాట్‌కేక్‌ల లాగా అమ్ముడు అయ్యాయి.**

**కావలసినవారు ఈ క్రింది చిరునామాకు చెక్కులు, డ్రాఫ్టులు పంపండి. పోస్టేజి ఉచితం**

**పుస్తకం వెల : 100/-**

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
*ఇం.నం. 5-10-180/ఎ&ఎ1, బ్యాంక్ లేన్, హిల్‌ఫోర్ట్ రోడ్,*
*హైదరాబాద్ - 500 004, ఫోన్: 040-2323 1818*



# సమాచార హక్కు చట్టానికి ఆరేళ్ళు
# ప్రశ్నించడం నేర్చుకోవాలి

**ప్రశ్నించడం ద్వారా వ్యవస్థలో మార్పు వస్తుందని సామాన్యుడు సైతం ప్రశ్నించడం నేర్చుకోవాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ సమన్వయకర్త కూకట్‌పల్లి శాసనసభ్యులు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.**

సమాచార హక్కు చట్టంతో పాలనా పరమైన అవినీతిని నిర్మూలించి, పారదర్శక పాలనకు మార్గం సుగమం చేయాలని జేపీ అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారానే వ్యవస్థలోని లోపాలన్నీ తొలగిపోతాయనుకోవడం భ్రమేనని ఇటువంటి చట్టాలు అనేకం వస్తేనే అనుకున్న లక్ష్యాలు నెరవేరతాయని అన్నారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి ఆరేళ్ళు అయిన సందర్భంగా అక్టోబర్ 12వ తేదీన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని శ్రీరామానుజాచారి ఫంక్షన్ హాల్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గౌరవ అతిధిగా వచ్చిన జయప్రకాష్‌నారాయణ్ ప్రసంగిస్తూ సమాచార హక్కు చట్టం అమలు గురించి నిరాశ చెందనవసరం లేదన్నారు.

ఈ చట్టం క్రింద దరఖాస్తు చేసుకోగానే సమాచారం అందిస్తే ఆశ్చర్యపోవాలి గాని ఆటంకాలు కల్పిస్తే ఆశ్చర్యపోవాల్సిన పని లేదన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు అంత నిజాయితీతో వ్యవహరిస్తే ఈ చట్టంతో పనివుండదని అన్నారు. ఈ చట్టం ఎవరూ తప్పించుకోలేనంత పకడ్బందీగా వుందని, దీని బలాన్ని అర్థం చేసుకుని తప్పించుకునేందుకు వారు మార్గాలు వెదుకుతుంటారన్నారు. ఈ చట్టం ద్వారా సామాన్యపౌరులు కూడా చట్ట సభల సభ్యుల మాదిరిగానే ప్రభుత్వంలోని అన్ని వివరాలు తెలుసుకునే వీలుకలుగుతుందన్నారు. పౌరసమాజం చట్టం పరిధి, పరిమితి అర్థం చేసుకుని సహచట్టాన్ని అస్త్రంగా వాడుకోవాలని అన్నారు. చాలామంది వ్యక్తిగత సమస్యలకు సమాచార హక్కు చట్టాన్ని అస్త్రంగా వాడుకుంటున్నారని జేపీ అన్నారు. సమాచార హక్కు



చట్టంపై అవగాహన కల్పించటానికి ఉద్యమ సంస్థలు ఇంకా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టంలోని ప్రతి క్లాజుకు తానే బాధ్యుడనని, చట్టంలో కొన్ని లోపాలున్న మాట వాస్తవమేనని రికార్డుల నిర్వహణ చట్టంలో ప్రస్తావించకపోవడం లోపమేనన్నారు. ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి వాటిని సరిచేసుకోవాలని ఆయన సూచించారు.

ముఖ్య అతిధిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు ప్రసంగిస్తూ సమాచార హక్కు చట్టం అమలులోకి రాకముందే తాను పదవీ విరమణ చేశానని అందువల్ల తాను అధికారంలో ఉన్నప్పుడు ప్రతీ ప్రభుత్వ పనిని రహస్యంగా ఉంచాలనుకునేవాడిననీ తెలిపారు. పదవిలో వుండగా బడ్జెట్ రహస్యాలు అత్యంత గోప్యంగా ఉంచానని దాని వలన ప్రజలకు మంచి జరగలేదని ఇప్పుడు గ్రహించానని అన్నారు. సమాచార హక్కు చట్టం అన్ని చట్టాల కంటే మంచి చట్టమని అన్నారు. సమాచార హక్కు చట్టం సక్రమ అమలుకు ఏర్పడే కమిటీతో సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని మాధవరావు అన్నారు. తాను సర్వీసులో ఉండగా చట్టాలను దాచిపెట్టిన పాపాలకు పరిహారంగా భావిస్తానని చమత్కరించారు. అధికారులెప్పుడూ రహస్యాలను దాచాలనుకుంటారని కాని వాటిని బహిర్గతం చేస్తేనే ప్రజలకు, ప్రభుత్వానికి మంచిదని అన్నారు.

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సమన్వయకర్త టి.యల్. నరసింహారావు మాట్లాడుతూ సమాచారహక్కు చట్టాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందనీ సమాచార కమీషనర్లను ఏడాది కావస్తున్నా ఇంతవరకూ నియమించలేదని విమర్శించారు.

ప్రారంభోపన్యాసం చేసిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర మాజీ సమన్వయ కర్త, డి.వి.వి.యస్.వర్మ ప్రసంగిస్తూ సమాచార హక్కు చట్టం అమలుపై అప్పుడే నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. సహచట్టం ద్వారా దేశంలో అనేక పెద్ద పెద్ద స్కాములు బయటపడ్డాయని అన్నారు.

రాజ్యసభ మాజీ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి ప్రసంగిస్తూ సమాచార హక్కుచట్టం అమలు దినోత్సవ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థను అభినందించారు. భారతదేశంలోనే ఒక్క ప్రధాన సమాచార కమీషనర్‌తో పని చేయిస్తున్న ఘనత మన రాష్ట్రప్రభుత్వానిదేనని అన్నారు.

సమాచార హక్కు చట్టం ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రాజు ప్రసంగిస్తూ అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య పౌరసమాజం సమాచార హక్కు చట్టం విజయాలు సాధించిందన్నారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర మాజీ కార్యదర్శి కటారి శ్రీనివాసరావు ప్రసంగిస్తూ విద్యావంతులులో సైతం సమాచార హక్కు చట్టంపై అవగాహన లేదన్నారు. సమాచారహక్కు చట్టం కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు ప్రసంగిస్తూ మన దేశంలో చాలా చట్టాలు సరిగ్గా అమలుకావడం లేదని అన్నారు. రాజకీయ చిత్తశుద్ధి ఉంటేనే ఏ చట్టమైనా సక్రమంగా అమలౌతుందన్నారు.

సహచట్టం క్రియాశీల కార్యకర్త రామకృష్ణ ప్రసంగిస్తూ ఈ చట్టం ద్వారా వ్యక్తిగత సమస్యల కన్నా సామాజిక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని అన్నారు. సమాచార హక్కు చట్టం కమీషన్‌లో వేలాది కేసులు పెండింగులో ఉన్నాయని, కమీషనర్లను వెంటనే నియమించటానికి ప్రభుత్వంపై పౌరసమాజం వత్తిడి తేవాలన్నారు.

సీనియర్ అడ్వకేట్ మొహమూద్ అలీ ప్రసంగిస్తూ పారా మెడికల్‌స్టాఫ్ లాగానే, పారా లీగల్ వ్యక్తులు కూడా గ్రామాల్లో తిరుగుతూ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ చట్టం అమలుకు స్వచ్ఛంద సంస్థలకు సహకరించటానికి తాను సిద్ధమేనన్నారు.

సభ్యులు అడిగిన పలు సమాచార హక్కు చట్టం సమస్యలకు డా॥ జయప్రకాష్ నారాయణ్ సమాచార కమీషనర్ లా సెక్రటరీ మోహన్ కృష్ణ సమాధానాలిచ్చారు. ఉద్యమ సంస్థ కార్యదర్శి కడియాల మధుసూధన్ రావు వందన సమర్పణతో సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ఉద్యమ సంస్థ కార్యదర్శి వెంకటరమణ, సమన్వయ సంఘ సభ్యుడు యమ్. కృష్ణమూర్తి, ప్రకాశం జిల్లా సంస్థ కన్వీనర్ యం.వెంకటేశ్వర్లు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ టి. బాలగాంగాధర్ రావు, కో కన్వీనర్ బాల నర్సయ్య, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ వెంకట నారాయణ, కో కన్వీనర్ గుండా వెంకన్న, మహిళా సత్తా అధ్యక్షురాలు శ్రీమతి ఎన్.సరోజాదేవి, యం.వి.యఫ్. ప్రతినిధి యస్. రాములు, ప్రేమవాహిని, అధ్యక్షులు యం.చిదంబరరావు, అనిల్ కుమార్, పి.భవాని, వి.భవాని, జీవనలత, మోహన్‌రెడ్డి, ఇంకా అనేక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమాచార హక్కు చట్టం కార్యకర్తలు పాల్గొన్నారు. ■

# దారి సిద్ధం... ఇక మనం సంసిద్ధం కావాలి

జాతి గిత్తల పౌరుషానికి, పల్లెసీమల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే ఒంగోలు పట్టణం లోక్‌సత్తా అర్ధదశాబ్ది ఉత్సవాలకు వేదికైంది. అయిదేళ్ళ రాజకీయ ప్రస్థానాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్ళడం, జాతి నిర్మాణంలో తనదైన పాత్రను పోషించేందుకు లోక్‌సత్తా పార్టీ ఈ వేదికను చరిత్రాత్మకంగా భావించింది. సముద్రనీలాన్ని, దాన్ని గాంభీర్యతను జనసంక్షేమానికి చిహ్నంగా భావిస్తూ, దానినే పార్టీ పతాకంలో నిలుపుకున్న లోక్‌సత్తా – ఒంగోలు పట్టణానికి నీలవర్ణశోభను తీసుకొచ్చింది.

## లోక్‌సత్తా పార్టీ 5వ వార్షికోత్సవం నివేదిక



అక్టోబర్ 8 శనివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు పట్టణంలోని శ్రీనివాస కళ్యాణమండపంలో నాయకత్వ సదస్సు ప్రారంభమైంది. పార్టీ జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా పార్టీ ప్రచురించిన పార్టీ సాహిత్యం 8 పుస్తకాలను సదస్సులో ఆవిష్కరించారు. సదస్సుకు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డివివిఎస్ వర్మ అధ్యక్షత వహించారు. అనంతరం అయిదేళ్ళ పార్టీ వెలుగునీడలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణపై పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

### జనం గుర్తించారు ...నాయకత్వానికి సంసిద్ధం కావల్సింది మనమే ...!

అయిదేళ్ళ ప్రయాణంలో లోక్‌సత్తా ఎప్పుడూ ప్రజల పక్షమేనని, ఏనాడూ రెండు నాలుకలతో మాట్లాడకుండా స్థిరమైన అభిప్రాయాల్ని వెల్లడిస్తుందన్న నమ్మకాన్ని ప్రజల్లో పాదుగొల్ప గలిగామన్నారు జేపీ. రాష్ట్రంలో, దేశంలో సంభవిస్తున్న ఇన్ని వివత్కర పరిస్థితులు, అవాంతరాల మధ్య కూడా లోక్‌సత్తా బతికిబట్ట కడుతోందంటే అందుకు మన నిబద్ధతే కారణమన్నారు. ఇదే సమయంలో ప్రజాస్వామ్య బద్ధమైన పార్టీ నిర్మాణాన్ని చేపట్టడం, నిజాయితీగల నాయకత్వాన్ని రూపొందించాల్సిన బాధ్యత మనదేనని గుర్తుచేశారు. ఈ బాధ్యత నెరవేరినరోజున లోక్‌సత్తా పార్టీని కనీసం కంట్లో కన్ను పెట్టి చూసే శక్తి ఎవరికీ వుండదని, సూర్యుడిని చూడడంలా వుంటుందని జేపీ అభివర్ణించారు. అందుకు సిద్ధం కావాలని ఆయన పార్టీ శ్రేణులకు

పిలుపునిచ్చారు. సంప్రదాయ రాజకీయ పార్టీలన్నీ పతనమవుతున్న దశలో మనమిక్కడ సమావేశమవుతున్నామని, నిజంగా ఈ జాతి నిర్మాణానికి కావల్సిన ప్రతి మౌలిక లక్ష్యాన్నీ సాధిస్తామన్న సంకేతాన్ని ఈ వేదికమీద నుంచి యావత్‌దేశ ప్రజానీకానికీ ఇస్తున్నామన్నారు.

సిద్ధాంతాల పునాదిగా రాజకీయాన్ని చేయడాన్ని లోక్‌సత్తా మాదిరిగా చేసే సాహసాన్ని భారతదేశంలో మరేపార్టీ కూడా చేయలేదని జేపీ అన్నారు. రాజకీయం ఎందుకు చేయాలి అన్న విషయాన్ని ఆ పార్టీలు మర్చిపోయాయని, కానీ లోక్‌సత్తా 15 ఏళ్ళ ప్రస్థానంలో ఒక ఉద్యమంగా, రాజకీయపార్టీగా ఎందుకోసం ఉద్యమం చేస్తున్నాం, ఎందుకోసం వేలాదిమంది రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా కదలివస్తున్నారు, వారి శక్తియుక్తులు, సమయాన్ని వెచ్చిస్తున్నారనే విషయాన్ని మనం మర్చిపోవడం లేదన్నారు. ఏ మూలాల నుంచి మనం ప్రారంభించామో వాటిని మర్చిపోతే ప్రమాదమన్నారు. దేశాన్ని మార్చుకోవడానికి షార్ట్‌కట్స్ లేవన్నారు.

**ఇంకా జేపీ ఏమన్నారంటే ...**

"రాజకీయ పార్టీల్లో అవినీతి స్వాతంత్ర్యానికి ముందునుంచీ వున్నప్పటికీ, ఇవ్వాళ్టి పరిస్థితి విచిత్రమైనది. ఒకప్పుడు సిద్ధాంతాలు, లక్ష్యాల కోసమే పార్టీలు పుట్టాయి, నడిచాయి. అందువల్లే ఆ సిద్ధాంతాలను నమ్మివచ్చినవారి మధ్య పరస్పర గౌరవం, అభిమానం వుండేవి. సిద్ధాంత విభేదాలున్నా మౌలిక లక్ష్యాలు ఆయా పార్టీలను కలిపివుంచాయి. అనంతరకాలంలో వ్యక్తిపూజ మొదలైంది. కొందరు వ్యక్తులు, వారి కుటుంబాలే పార్టీలను నడిపిస్తున్నాయి. కాలక్రమేణా అవి అధికారం మీద మోజుగా మారాయి. పార్టీల కార్యకర్తలు కూడా ఆ నాయకుల్ని, పార్టీలను అట్టిపెట్టుకునివుంటే మాకు అధికారం వస్తుంది, నాయకుడిని మనం ద్వేషించినా .. అది అధికారం కోసమేననే దృష్టి కనిపించింది. నాయకుల్లో చిత్తశుద్ధి, నిజాయితీ పోయాయని తెలిసిన వెంటనే నాయకత్వం ప్రతిభగానీ, వ్యక్తిత్వం గానీ నిరూపించుకోలేకపోతున్నాయి. అధికారం ఒక్కటే నిలిపి వుంచుతోంది. ఇది మూడో దశ. ఇవ్వాళ నాలుగో దశకి వచ్చేశాం.

**నాలుగోదశ నుంచే పాఠాలు నేర్చుకోవాలి**

ఈరోజు ఒక పార్టీ సిద్ధాంతం అంటే నమ్మకం లేదు, నాయకత్వం అంటే గౌరవం లేదు. అధికారం వస్తుందన్న విశ్వాసం లేదు. డబ్బు ఖర్చు, కుల సమీకరణాలు, స్థానిక ప్రాబల్యాలే తమను నిలబెడతాయని, పార్టీ వున్నా, లేకున్నా సొంతంగానే సమాజం మీద ప్రభావం చూపించగమనే నమ్మకం చాలామందిలో పూర్తిగా వచ్చేసింది. ఆ దశ మరీ ముదిరిపోవడంతో పార్టీలు కకావికలైపోతున్నాయి. అందుకే పార్టీలు దూదిపింజల్లా విడిపోతున్నాయి. చెప్పుకోదగ్గ పార్టీ అంటూ లేదు. కాంగ్రెస్ పార్టీ ముఠా తగాదాలకు, పూర్తిగా అసమర్థతకీ నిలిచిపోతే, టీడీపీ విశ్వాస రాహిత్యానికీ, అవకాశవాదానికీ పూర్తిగా అంకితమైపోతే, ఇతర పార్టీలు అనైక్యతతో సమాజాన్ని ముక్కలుచేయడంలో మునిగిపోతే...; అన్ని పార్టీలూ కలిసి అవినీతిలో కూరుకుపోయాయి. దీనివల్ల పార్టీల్లో వున్న కార్యకర్తలకు, నాయకత్వానికి కనీస విశ్వాసం, విధేయత లేకుండా పోతున్నాయి. నా పార్టీకి అధికారమిస్తే సరే, లేకుంటే మీ పార్టీలను ఇష్టమొచ్చినట్టు తిడతానంటూ ఒక యువ నాయకుడు బయల్దేరాడు. కర్ణాటకలో ముఖ్యమంత్రి యడ్యూరప్పను అధికారంలో వుంచినంత కాలం భాజపాకి జై కొట్టారు, అధికారం నుంచి తొలగించగానే తాను చెప్పినవారిని అందలమెక్కించకపోతే అంతు తేలుస్తానని తన మాట నెగ్గించుకున్నాడు. ఇంతకాలం కలిసి దేశాన్ని దోచుకుంటున్నవారు ఇవ్వాళ విడివిడిగా దోచుకుంటూ ఒకళ్ళమీద ఒకళ్ళు విషాన్ని కక్కుకుంటున్నారు. కులాన్ని బలంగా చేసుకుని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఒక్కసారి కొన్ని వందల కోట్లు సంపాదించుకున్నట్లయితే .. ఇక పార్టీ ఎందుకు అని ప్రశ్నించే నాయకులూ వచ్చేశారు. ఆ పార్టీలకు ప్రత్యర్థి పార్టీలుగా మనకిది మంచి అవకాశంగా కనిపించొచ్చు; కానీ, దేశానికి ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి. ఇవన్నీ చూస్తున్న ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు, రాజకీయాలను తీవ్రంగా అసహ్యించుకుంటున్నారు. ఇలాంటి సందర్భంలో ఈ రాజకీయాలను ఒక గాడి మీద పెట్టాల్సిన బాధ్యత మనందరి మీదా వుంది."

**అభివృద్ధి కనిపిస్తోంది .. కానీ ఫలితాలెక్కడ ?**

ఓపక్క రాజకీయం ఇలా కుళ్ళిపోతున్నా .. ఆర్థిక ప్రగతి మాత్రం 7 నుంచి 8 శాతం దాకా సాధ్యమని రుజువవుతోందని, కానీ ప్రగతి ఫలాలు అందరికీ అందడంలేదు, బీదరికం తగ్గడం లేదని జేపీ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రు.26 ఖర్చు పెట్టగలిగినవారు బీదరికం బయట వున్నట్టేనని కేంద్రం నిర్ధారించినట్టు ఇటీవల కొన్ని పత్రికా కథనాలు పేర్కొన్నాయని, కానీ విద్యనూ, ఆరోగ్యాన్నీ అందించకుండా బీదరికాన్ని తొలగించగలరు అంటే అంతకంటే మూర్ఖత్వం ఇంకొకటి

లేదన్నారు. ఏడాదికి 40 కోట్లమందికి రు.3600 కోట్లు బీదజనానికి పంపిణీ చేస్తే బీదరికం పోతుందని నమ్మబలుకుతున్నారని, ఇంతకంటే అన్యాయం ఇంకొకటి లేదని విమర్శించారు. బీదరికంలో వున్నవారికి ఖచ్చితంగా సాయం అందించాల్సిందేనని, కానీ బీదరికం పోయేందుకు, సంపాదన పెరిగేందుకు అవకాశాల్ని కల్పించకుండా సమాజంలో అశాంతి తొలగదు, రాజకీయంలో అనిశ్చితి పోదన్నారు. రు.2/ రు.1 బియ్యం కావచ్చు, ఉచిత విద్యుత్, రాయితీలు కావచ్చు. రీఎంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ కావచ్చు, కానీ ఇవన్నీ ఇన్నేళ్ళుగా అందిస్తున్నా ఇంకా బీదరికం ఎందుకున్నది; బీదరికం పోగొట్టడమే మా లక్ష్యమని పార్టీలు, నాయకులు చెప్పుకుంటున్నా కూడా, రు.26 ఖర్చు చేసినా బీదరికం లేదు అనే పరిస్థితికి దేశాన్ని ఎందుకు తీసుకొచ్చారని జేపీ ప్రశ్నించారు. రు.26 ఖర్చుతో ఈ నాయకులు, వారి కొడుకులు, కూతుళ్ళు, ఉన్నతాధికారులు, వారి బంట్రోతులైనా బతకగలరా? ప్రజల్ని చేతులు చాచి అర్థించే బిచ్చగాళ్ళుగా చూసినంత కాలం వ్యవస్థ తీరులో మార్పు రాదన్నారు. ఒకపక్క సంపద పెరుగుతున్నా, అవకాశాలు కొందరికే అందుతుండడంతో జనంలో కసి పెరుగుతోందన్నారు. దానిని ఏ రకంగా అదుపుచేయాలో తెలియని ఈ రాజకీయ పార్టీలు కులం, ప్రాంతీయతల పేరుతో సమాజాన్ని ముక్కలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ రాష్ట్రంలో, దేశంలో యువత కోరుకుంటున్నది ఇలాంటి రాజకీయం కాదని, పుట్టిన పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డా ఎంత ఎత్తుకైనా ఎదగగలిగే వాతావరణాన్ని రాజకీయాలు సృష్టించాల్సివుందని, లోక్‌సత్తా నూటికి నూరుపాళ్ళు అందుకు కట్టుబడివుందన్నారు.

ఇవ్వాళ్టి రాజకీయాల్ని ప్రజలు ద్వేషిస్తుండడం సరికాదని, కుళ్ళు రాజకీయాలను నిర్మూలించాలంటే అంతకంటే మరింత మంచి రాజకీయం కావాలని జేపీ పునరుద్ఘాటించారు. ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో జరిగిన సంఘటనలు .. దేశవ్యాప్తంగా వచ్చిన ఉద్రేకాలు, ఆవేశం .. ఇవన్నీ ఈ రాజకీయాల్ని సమాధి చేయాలన్న కసినుంచే పుట్టాయని, ఈ రాజకీయాల్ని అంతం చేయాలన్న ఆర్తినుంచే పుట్టాయన్నారు. లోక్‌సత్తా శ్రేణులు ఈ పరిస్థితులను అర్థం చేసుకుని రాజకీయ ప్రక్షాళన, ఉన్నతమైన రాజకీయాల దిశగా సాగాలన్నారు.

## లోక్‌సత్తా భాషే ఇవాళ అన్ని పార్టీలకూ దిశానిర్దేశం చేస్తోంది ..

అనంతరం జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా స్వీయ విశ్లేషణ చేశారు. "ఒక ఉద్యమంగా పదిహేనేళ్ళు, ఒక రాజకీయ పార్టీగా ఐదేళ్ళు నడిచాం. రాజకీయం జనం సొంతమైతేనే మంచి ఫలితాలొస్తాయి. సభ్యులొచ్చి పార్టీని పోషించుకోవాలి, సభ్యులే పార్టీని నియంత్రించుకోవాలి, నాయకత్వాన్ని నిర్మించుకోవాలి. సామర్థ్యం, విశ్వసనీయత వున్న వ్యక్తులు సమాజంలో ఎప్పుడూ అవసరం. కానీ కేవలం వ్యక్తుల ప్రాతిపదికన దేశం నడవదు. గాంధీ కూడా ఒక మార్గాన్ని చూపించారు. లక్షలమంది కలిసివచ్చి ఆ మార్గాన్ని పంచుకున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయన అస్త్రసన్యాసం చేసినా కూడా జాతి నిర్మాణం జరుగుతూనేవుంది. లోక్‌సత్తా పార్టీ కూడా అదేవిధంగా నడిచింది. ఇలా నడవాలంటే ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ



నాయకత్వం అన్ని స్థాయిల్లో ఎంపిక కావాలి. పార్టీ సభ్యుల, దేశ ప్రజల ఆస్తిగా ఈ పార్టీ నడవాలి. ఒకవైపు బలమైన నాయకత్వం నిర్మాణానికి అవకాశం కల్పిస్తూ, దేశంలో, రాష్ట్రంలో వున్న యువతను జాతినిర్మాణం కోసం ఆహ్వానించుకుంటూ, రెండోవైపు బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణం కోసం పనిచేయాలి”.

“లోక్‌సత్తా మాటలు మొదట చాలా కొత్తవి. కానీ ఇవ్వాళ ఎక్కడచూసినా ఇవే. పాపులర్ సినిమాల్లో, జాతీయ టీవీ ఛానెళ్ళలో, అన్నాహజారే నోట, దేశాన్ని దోచుకుంటున్న నేతల నోట్లనుంచి సైతం ఇవే మాటలొస్తున్నాయి. అంటే... సమయం వచ్చింది. మనం దేనికోసం పోరాడుతున్నామో ఆ భావాలు ఇవ్వాళ పతాకస్థాయికొచ్చాయి. దానికనుగుణంగా సంస్థాగతంగా ఎదగాల్సిన, నాయకత్వ నిర్మాణం చేయాల్సిన అవసరం ముందుకొచ్చింది. ఈ వార్షిక సమావేశం నుంచి ఇదే మనం లక్షలాదిమంది సభ్యులకు, ప్రజలకు మనమిచ్చే సందేశం” అన్నారు డాక్టర్ జేపీ.

## అధికారం కోసం ఇక రాజీలేని పోరాటం చేస్తాం

అధికారాన్ని పొందడం కోసం మేమంతా సిద్ధంగా వున్నాం. అధికారాన్ని ఏనాడూ లక్ష్యంగా భావించబోం కానీ మార్గంగా భావిస్తూ, దాని కోసం రాజీ లేని పోరాటం చేస్తామన్న స్పష్టమైన సంకేతాన్ని సమాజానికి అందించాలని జేపీ పిలుపునిచ్చారు. నాయకత్వ లక్షణాలుండి, సమాజాన్ని మార్చుకోవాలనుకునే ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్షల్లేకుండా లోక్‌సత్తా అవకాశాల్ని కల్పించే వేదికగా జనంలోకి వెళ్ళాలన్నారు.

## నేనే ముందుంటా .. కానీ నా చుట్టూనే పార్టీ తిరగదు ...

ఖచ్చితంగా పార్టీని తాను ముందుండి నడిపిస్తానని, అదే సమయంలో జాతి భవిష్యత్‌ను నిర్దేశించాల్సిన ఒక రాజకీయపార్టీ ఒక కుటుంబం / వ్యక్తి చుట్టూ తిరగకూడదని జేపీ అన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ నాయకత్వం కోసం ఎదిగే అవకాశం రావాలని, అందుకే వచ్చే ఏడాదే పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరగాలన్నారు. సభ్యుల, ప్రజల మద్దతుతో అవసరమైతే పార్టీ వ్యవస్థాపకులను కూడా నిలదీయగలగాలన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో ఖమ్మంలో జరిగే పార్టీ సమావేశంలో ఇందుకు బాటలు వేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా మన కార్యక్రమాలు వుండితీరాలన్నారు. ప్రజలిచ్చిన నమ్మకాన్ని నూటికి నూరు పాళ్ళు నిలబెట్టుకుంటామన్నారు. టెక్నాలజీ, మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా మనం పనిచేసినట్లయితే 2014లో మన నిజాయితీ పునాదిగా .. బాధ్యతనిస్తే తీసుకోవడానికి, ప్రజలిచ్చిన తీర్పును శిరసావహించడానికి సిద్ధంగా వున్నామని ప్రజలకు తెలియజెప్పాలని జయప్రకాష్ నారాయణ్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

సుమారు 70 నిముషాలపాటు ఉద్వేగభరితంగా సాగిన డాక్టర్ జేపీ ప్రసంగం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ‘రాజకీయానికి ప్రజలే కేంద్రబిందువులు కావాలన్న లోక్‌సత్తా వైఖరి’ని మరోసారి తేటతెల్లం చేసింది.

అనంతరం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డివివిఎస్



వర్మ మాట్లాడుతూ - ఏ ఎన్నికలు చూసినా ఎవరోఒకరు గెలుస్తున్నారుకానీ జనం నిరంతరం ఓడిపోతున్నారనే వాస్తవాన్ని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. పార్టీలోకి కొత్తతరాన్ని ఆహ్వానిస్తున్నామని, వారి ఆధ్వర్యంలో పనిచేయాలని, సంస్థాగత ఏర్పాట్లు కూడా అందుకు అనుగుణంగానే జరగాలన్నారు.

తమిళనాడు లోక్‌సత్తా పార్టీ ప్రతినిధి సెంథిల్ మాట్లాడుతూ తమిళనాడులో 1969లో నాయకత్వం తీసుకున్న కరుణానిధి 42 సంవత్సరాలు పాలించినా, ఇవ్వాళ్టికీ ఇంకా పదవులు కావాలనే కోరుకుంటున్నారన్నారు. పార్టీ ఉపాధ్యక్షులు వై.డి.రామారావు మాట్లాడుతూ కమిటీల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేయడానికి మండలస్థాయిలో రు.50 వేల నిధులు సేకరించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. అనంతరం పీపుల్ ఫర్ లోక్‌సత్తా ప్రతినిధి పద్మ మాట్లాడుతూ ఇక్కడినుంచి తాము స్ఫూర్తిని తీసుకుని, తిరిగి స్ఫూర్తినిచ్చేలా తమ ప్రయాణం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అమెరికాలో 240 మైళ్ళపాటు జరిపిన దండిమార్చ్ తమకు మరింత ఉత్సాహాన్ని, లోక్‌సత్తాను మరింత బలపరచాల్సిన అవసరాన్ని గుర్తుచేశాయన్నారు.

## రాజకీయతీర్మానం

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.రవిమారుత్ రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

"రాష్ట్ర విభజన అంశంలో రాజకీయ పార్టీలన్నీ రెండుగా చీలిపోయాయి. వ్యవసాయంలో సంక్షోభం ముదిరిపోయింది. రైతులు తీవ్రనిర్వేదంలో వున్నారు. మద్యనియంత్రణ ఊసే లేకుండాపోయింది. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులను అందించడం కాదు .. కనీసం స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలుజరపలేని దుస్థితిలో రాష్ట్రప్రభుత్వం పడిపోయింది. అవినీతి విశృంఖలమైపోయింది. అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ అవినీతి కుంభకోణాల్లో పీకల్లోతు కూరుకుపోయివుంది. తెలుగుదేశం పార్టీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు. ప్రభుత్వాన్ని అడ్డుకునే సత్తా ప్రతిపక్షాల్లో దేనికీ లేదు. ఇలాంటి రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో రాష్ట్రప్రజలకు లోక్‌సత్తా మాత్రమే ఏకైక ఆశాకిరణంగా మారింది. అవినీతి వ్యతిరేక పోరాటంలో లోక్‌సత్తా ఈరోజు ప్రజలకు చాలా ధైర్యాన్నిచ్చే పార్టీగా వుంది. ఈరోజు అన్నాహజారే చేస్తున్న పోరాటానికి పునాదులను చాలా సంవత్సరాల ముందునుంచే ఏర్పరిచిన చరిత్ర లోక్‌సత్తాకున్నది. ఈ నేపథ్యంలో వేదికను మరింత పటిష్టంగా ప్రజల్లోకి



తీసుకువెళ్ళడానికి పార్టీ శ్రేణులంతా ఒక్కతాటిపై కదలిరావాలి" అని రవిమారుత్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను అంచనావేసి, రాష్ట్రంలో సుపరిపాలనను అందించడం, ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదగడానికి వేదికగా లోక్‌సత్తాను మరింత బలోపేతం చేయడంపై పార్టీ వర్కింగ్ కమిటీ చర్చించి ఈ రాజకీయ తీర్మానాన్ని రూపొందించింది.

## బృందచర్చలు

అనంతరం - రాబోయే ఐదారు నెలల్లో పార్టీని మరింత వేగంగా జనంలోకి తీసుకువెళ్ళేందుకు ఆరు అంశాల ప్రాతిపదికన పార్టీ ప్రతినిధులు ఆరు బృందాలుగా ఏర్పడి కార్యాచరణ ప్రణాళిక తయారుచేశారు. పట్టణాల్లో చేయాల్సిన పనులు, మున్సిపల్ ఎన్నికల్లో ఎలా పనిచేయాలి మొదలైన అంశాలపై చర్చకు పార్టీ ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, గ్రామీణప్రాంతాల్లో పార్టీ నిర్మాణంపై వై.డి రామారావు, వ్యవసాయంపై ఎలా పనిచేయాలి, స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్యకు ఎలాంటి దన్నునివ్వాలి మొదలైన అంశాలపై చర్చించేందుకు దాని కార్యదర్శి డాక్టర్ పి.భాస్కరరావు, మహిళాసత్తా కార్యకలాపాలను బలోపేతం చేసే అంశాలపై ఎం.సరోజాదేవి, యువసత్తా తరపున చేయాల్సిన అంశాలపై ఆ విభాగం అధ్యక్షుడు పి.శివాజీరాజు, సర్వజనసత్తా కార్యకలాపాల విస్తృతి కోసం ఆ విభాగం అధ్యక్షుడు ఈద చెన్నయ్యలు ఆరు బృందాలుగా ఏర్పడి చర్చించి తీర్మానాలను రూపొందించాలని నిర్ణయించారు. ఆరుబృందాల చర్చలు ప్రారంభం కావడానికి కొంచెం

మధ్యాహ్న భోజనం తరువాత ఆరు బృందాలు తమ నివేదికల్ని సమర్పించాయి. పట్టణ ప్రాంతాల్లో పార్టీకి వున్న ఆదరణను దృష్టిలో వుంచుకుని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వీలున్నన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామని తొలి బృందం తెలిపింది. స్థానిక ప్రభుత్వాల సాధికారికత మొదలైన అంశాలపై ఎంపిక 56 మున్సిపాలిటీల్లో 41 మున్సిపాలిటీల్లోని 280 వార్డుల్లో శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు.

డిసెంబర్ 31 నాటికి రాష్ట్రంలోని 120 మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తికావాలని పార్టీ ఉపాధ్యక్షులు వై.డి రామారావు నేతృత్వంలోని రెండవ బృందం నిర్ణయించింది. పార్టీ నేతలు మనోరమ, గీతామూర్తి, ఆంజనేయులు, మరో 30 మంది సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. మండలాల్లో, గ్రామాల్లో పార్టీ అభివృద్ధికి స్థానిక సమస్యలను ఎజెండాగా తీసుకుని పనిచేస్తే సభ్యత్వాలను మరింత విస్తృతం చేయగలమని బృందం అభిప్రాయపడింది. స్థానికంగా నిధుల సమీకరణ ఏర్పాట్లకు కృషిచేస్తామని బృందం ఏకగ్రీవంగా తీర్మానించింది.

మూడవ బృందం - వ్యవసాయం తదితర అంశాలమీద డాక్టర్ పి.భాస్కరరావు నేతృత్వంలోని బృందం .. రైతు సమస్యలు, వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలపై చర్చించింది. వ్యవసాయాన్ని గిట్టుబాటు అని కాకుండా లాభసాటిగా మార్చాలని, ఇందుకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్దేశించుకుంటున్నట్లు తెలిపింది. విశ్రాంత వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, వజీర్, విజయ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఈ బృందంలో వున్నారు.

నాలుగో బృందం సర్వజనసత్తా తరపున తీర్మానాన్ని ఆ విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ చింతల చదివారు. ఎస్సీ, ఎస్టీల చట్టం అమలు, రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం సక్రమ అమలు, బినామీ జాబ్‌కార్డులను తొలగించడం, నెలకు 15


## లోక్‌సత్తా పార్టీ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాసనసభ ప్రసంగాలు (2009-11) <br> డా॥ జయప్రకాష్ నారాయణ్ | రూ 100/- |
| 2. మన ప్రజాస్వామ్యం సంక్షోభం - పరిష్కారాలు <br> డా॥ జయప్రకాష్ నారాయణ్ | రూ 50/- |
| 3. నూతన రాజకీయ సంస్కృతి <br> డి.వి.వి.యస్. వర్మ | రూ 10/- |
| 4. జన రాజకీయం <br> డి.వి.వి.యస్. వర్మ | రూ 10/- |
| 5. లోక్‌సత్తా పార్టీ @ 5 <br> (ఐదేళ్ళ లోక్‌సత్తా పార్టీ ప్రస్థానం) | రూ 10/- |
| 6. కూకట్‌పల్లిలో నిజమైన అభివృద్ధి | రూ 10/- |
| 7. రైతు వేదికల మార్గదర్శి | రూ 10/- |

**ప్రతులకు :**
**లోక్‌సత్తా పార్టీ - హైదరాబాద్** పేరుమీద చెక్కులు, డ్రాఫ్టులు
ఈక్రింది అడ్రస్‌కి పంపండి
మీ పోస్టల్ చిరునామా తెలియజేయండి. పోస్టేజి ఉచితం
**లోక్‌సత్తా పార్టీ ఆఫీస్**
ఇం.నం. 5-10-180/ఎ&ఎ1, బ్యాండ్ లేన్, హిల్‌ఫోర్ట్ రోడ్,
హైదరాబాద్ - 500 004, ఫోన్: 040-2323 1818

రోజులపాటు పని కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వడం, రాష్ట్రంలో ఖాళీగా వున్న 1.6 లక్షల ఎకరాల సాగుభూమిని భూమిలేని దళితులకు, గిరిజనులకు పంచడం, ఎస్సీ,ఎస్టీ,బీసీ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడం, ముస్లింల అభివృద్ధికి సచార్ కమిటీ నివేదికను తక్షణం అమలు జరిపేందుకు కృషిచేయడం తదితర అంశాలపై సర్వజనసత్తా తన కార్యాచరణను జనంలోకి తీసుకువెళ్ళనుందని ఈ బృందం ప్రకటించింది.

ఐదవ బృందం యువసత్తా తరపున పంచాది రాంబాబు నివేదిక ఇచ్చారు. బలమైన లోక్‌పాల్ నిర్మాణంలో యువతను భాగస్వాముల్ని చేయడం, 1200 చిన్నపట్టణాలలో ఉపాధి నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్ని రూపొందించడం తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి పార్టీని తీసుకువెళ్ళాలని తీర్మానించింది. రాబోయే మూడు నెలల్లో ఎంపిక చేసిన 10 జిల్లాల్లో రాష్ట్రస్థాయిలో ఔత్సాహిక యువతీయువకులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేస్తామని బృందం ప్రకటించింది.

ఆరవ బృందం మహిళాసత్తా అధ్యక్షురాలు ఎస్.సరోజాదేవి తీర్మానాన్ని సదస్సుకు సమర్పించారు. లోక్‌సత్తా రాజకీయ చర్చలు, ఇతర కార్యకలాపాల్లో మహిళాసత్తాకు కీలక ప్రాధాన్యమివ్వాలని, మద్యనియంత్రణపై మళ్ళీ గ్రామస్థాయినుంచి ఉద్యమించాలని, గ్రామాల్లో తీర్మానాలు చేయించాలని, రాజకీయాల్లో మహిళలు ప్రవేశించేందుకు అనువుగా వారిక అవగాహన కల్పించే కార్యక్రమాల్ని రూపొందిస్తామని తెలిపారు.

అనంతరం లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహనరావు అవినీతిపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రస్తుతం దేశంలో వున్న వాతావరణాన్ని ఉపయోగించుకోవడం చాలా అవసరమన్నారు. లోక్‌పాల్ బిల్లు వచ్చినా అవినీతి తగ్గదని, దేశంలో రాజకీయ, పాలనా సంస్కరణలు, స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు తప్పనిసరి అన్నారు. ఆ తర్వాత పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ తమ అభిప్రాయాలు, కార్యాచరణ ప్రణాళికలను వివరించారు.

5వవార్షికోత్సవం తర్వాత లోక్‌సత్తా ఒక రాజకీయపార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్ళడం, మున్సిపల్ ఎన్నికల్లో ప్రాతినిధ్యం, 2014 ఎన్నికలకు సంసిద్ధం కావడం దిశగా ముందుకు వెళ్ళాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు డివివిఎస్ వర్మ అన్నారు. కబుర్లతో సరిపెట్టుకోకుండా కార్యాచరణ దిశగా పార్టీని నడిపేందుకు నిర్దిష్టమైన లక్ష్యాలు పెట్టుకోవాలి. ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో లోక్‌సత్తాకు శాఖ ఏర్పాటు కావాలన్నారు. వచ్చే వార్షికోత్సవం నాటికి 150 నియోజకవర్గాల్లో పట్టుసాధించాలన్నారు. ప్రజాసమస్యల నుంచి కార్యాచరణను తీసుకోవాలని, అందుకోసం కొన్ని వర్గాలను ఆధారంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. రైతాంగసమస్యల మీద, యువత,విద్యార్థులలో నిరాశ, నిస్పృహలను పోగొట్టి పోరాడే పార్టీగా నిలదొక్కుకోవాలన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పార్టీ సంస్థాగత ఎన్నికలు రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిల్లో జరుపుకోవాలని వర్మ పేర్కొన్నారు.

అనంతరం డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పార్టీశ్రేణులను ఉద్దేశించి ముగింపు ఉపన్యాసం చేశారు. దేశంలోని చివరి మనిషిదాకా లోక్‌సత్తా సందేశం వెళ్ళాలన్నారు. సంఘర్షణ లేకుండా ఉమ్మడి లక్ష్యాలతో సంఘటితంగా పనిచేస్తేనే గెలుపు సాధ్యమవుతుందన్నారు. ఇప్పటిదాకా పటిష్టంగా తొలి అడుగు వేశామని, దీనిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. 100 పట్టణాల్లో, వాటిని అనుబంధంగా వున్న 200 మండలాలు, మరో 100 గ్రామీణ మండలాల్లో రాబోయే 3 నెలల్లో సంస్థాగతంగా శాఖలు ఏర్పాటు కావాలన్నారు. పార్టీలకు అతీతంగా తటస్థంగా పనిచేస్తూ దేశం మారాలని కోరుకునేవారిని లోక్‌సత్తా మీది అని చెప్పడం ద్వారా వారి భాగస్వామ్యాన్ని తీసుకోవాలన్నారు.

సదస్సు అనంతరం పార్టీ కార్యకర్తలు ఒంగోలు బైపాస్‌రోడ్డు నుంచి బహిరంగసభ జరిగే మున్సిపల్ మైదానం దాకా డాక్టర్ జేపీని గుర్రం మీద ఊరేగింపుగా తీసుకువెళ్ళారు. ఒంగోలు, ఇతర ప్రాంతాలనుంచి తరలివచ్చిన లోక్‌సత్తా కార్యకర్తలు, నాయకులు, ప్రజలను ఉత్తేజితం చేస్తూ డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగించారు.

రెండవరోజు అక్టోబర్ 9 ఆదివారం వివిధ జిల్లాలనుంచి వచ్చిన పార్టీ నాయకులు సమావేశమయ్యారు. తొలిరోజు చేసిన తీర్మానాలపై మరోసారి సమగ్రంగా చర్చించారు. డాక్టర్ జేపీ మాట్లాడుతూ ఈ కార్యాచరణను వీలైనంత వేగంగా, ప్రభావశీలంగా పూర్తిచేయాలని సూచించారు.

లోక్‌సత్తా పార్టీ ఐదేళ్ళ వేడుకలు పార్టీ శ్రేణులలో నూతనోత్సాహాన్ని నింపాయి. రాబోయే రోజుల్లో మరింత వేగంగా పార్టీని విస్తరించాలన్న స్ఫూర్తిని వారిలో నింపాయి.

**- సురేశ్ వెలుగూరి**

పార్టీ మీడియా విభాగం

# వ్యవస్థ మార్పు కోసం ఉద్యమిద్దాం...రండి!

## సంప్రదాయ పార్టీలు కుళ్లిపోయాయి : డా॥ జేపీ

ఈనాటి వ్యవస్థలో మార్పు తేచ్చే దిశగా యువత, మధ్యతరగతి ప్రజలు, రైతులు ఉద్యమించాల్సిందిగా లోక్‌సత్తా అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. జలగం వెంగళరావు వంటి నేత ముఖ్యమంత్రిగా ఉన్నా... ఎంతో నిరాడంబరంగా ఉండేవారని, ఇప్పుడు ఆర్భాటంతో కూడిన రాజకీయాలు నడుస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి మారాలని అన్నారు. రాజకీయాల్లోకి వద్దామను కుంటున్న యువతకు మార్గాలన్నీ మూసుకు పోయాయని, ప్రజల సమస్యలకు లోక్‌సత్తా పరిష్కారాలను అందిస్తుందని భరోసా ఇచ్చారు. వ్యవస్థలో మార్పు కోసం ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.



దేశంలో, రాష్ట్రంలో సంప్రదాయ పార్టీలన్నీ కుళ్లి పోయాయి. కుళ్లిన ఈ రాజకీయాలు అంతరిస్తాయి. ఇలాంటి తరుణంలో వ్యవస్థను పునర్నిర్మించుకునేందుకు యువత, మధ్యతరగతి ప్రజలు, రైతులు సమష్టిగా ముందుకు రావాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ఒంగోలులో నిర్వహించిన పార్టీ ఐదో వార్షిక నాయకత్వ సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన ఆదివారం 'ఈనాడు-ఈటీవీ'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

♦ **రాజకీయాలు కుళ్లిపోయాయంటున్నారు? ఒకనాటి రాజకీయాలకు ఇప్పుడున్నవాటికి ఎలాంటి తేడా ఉందంటారు?**

1977-78 వరకు జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఆయన పర్యటనకు ఒక్క కారుతోనే వెళ్ళేవారు. ఖర్చు, హంగు ఆర్భాటం ఉండేది కాదు. అతిథి గృహంలో ఉండి ప్రజల బాధలు వినేవారు. ప్రాజెక్టులు పరిశీలించి తక్షణ నిర్ణయాలు తీసుకునేవారు. కడప జిల్లా మైలవరం ప్రాజెక్టుకు నిధుల్ని వెంటనే మంజూరుచేసి తొమ్మిది నెలల్లో ప్రారంభోత్సవం చేశారు. 30 ఏళ్ల కిందటే రాజకీయంలో నిలకడ లోపించింది. పూర్వం రాజకీయాన్ని ఆదాయ మార్గంగా భావించలేదు. ఎంపీగా పనిచేసిన కాటూరి నారాయణస్వామి రిక్షాలో తిరిగేవారు. నేడొక ఎమ్మెల్యే బయలుదేరితే చుట్టూ మందీ మార్బలం.. జుగుప్సాకరమైన వాతావరణం.. నేడు వనరులను పునాదులతో సహా పెకలించి రూ॥వేల కోట్లు దోచుకోవడమే మార్గంగా రాజకీయాల్లోకి వస్తున్నారు. వారసత్వాలు ఎక్కువయ్యాయి. రాజకీయాల్లో పాలుపంచుకోవాలన్న తపన ఉన్న యువతకు మార్గం లేకుండా పోయింది. ఈ సమస్య నుంచి బయట పడాలంటే జనం పట్టించుకోవాలి. వ్యవస్థను సరిదిద్దుకునేందుకు అందరూ ఉద్యమించాలి.

♦ **ఓటర్లు డబ్బులిస్తేగానీ ఓట్లు వేయడం లేదు? ఈ పరిస్థితిలో మార్పు సాధ్యమా అని రాజకీయ నేతలంటున్నారు?**

విత్తు ముందా.. చెట్టు ముందా అంటే ఏది ముందు? విశ్వసనీయమైన రాజకీయాలు ఉండి, నమ్మకమైన నేతలుండి మీ కోసం మేం శ్రమిస్తాం ఓటేయండి అంటే ప్రజలు ముందుకు రారా? వస్తారన్న నమ్మకం మాకు ఉంది.

♦ **పార్టీలు ప్రజాకర్షక పథకాలను ప్రకటిస్తున్నాయి. ఇలా చేయడం మంచిదేనా?**

పథకాలకు లోక్‌సత్తా వ్యతిరేకం కాదు. కాలే కడుపునకు అన్నం పెట్టాల్సిందే. 60 ఏళ్ల వయసు వరకు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఉన్న వ్యక్తికి సామాజిక భద్రత కల్పించాలి. జనాకర్షక పథకాలను అన్నింటినీ కొట్టేయరాదు. ఒక వైపు పేదరికాన్ని కొనసాగిస్తూ మరోవైపు సాగుతున్న దోపిడీ రాజకీయాల్లో మార్పు రావాలి.

♦ **మద్యపాన నియంత్రణకు ఉద్యమించాలని లోక్‌సత్తా పిలుపునిస్తోంది కదా. కానీ మద్యం ఆదాయం పైనే ప్రభుత్వం ఆధారపడుతోంది. .. మీరేమంటారు?**

మద్యం మీద పన్నుల రూపంలో ప్రభుత్వానికి రూ॥19 వేల కోట్ల ఆదాయం వస్తోంది. ఇందులో ఎక్కువ తాగేది నిరుపేదలు. ఖజానాకు పన్నులు అవసరమే కానీ పేదలకు తాగబోయించి వారి జీవితాలను నిస్సారం చేయడం సబబు కాదు. ఆదాయానికి అనేక ప్రత్యామ్నాయాలున్నాయి.

♦ **సమాజంలోని పలువురు రాజకీయాలను ద్వేషిస్తున్నారు. ఎన్నికలకు దూరంగా ఉంటున్నారు....**

రాజకీయాలను ద్వేషించడం వల్ల ఉపయోగం లేదు. యువత రాజకీయాల్లో పాలుపంచుకోవాలి. రాష్ట్రం ఎదుర్కొంటున్న అనేక సమస్యలన్నింటికీ లోక్‌సత్తా పరిష్కారాన్ని చూపుతుంది.

♦ **లోక్‌సత్తా అధికారంలోకి వస్తే ఏడాదికి 15 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు... సాధ్యమా?**

ఇందులో పెద్ద మ్యాజిక్ ఏమీ లేదు. రాష్ట్రంలో ఏటా 18 లక్షల మంది జాబ్ మార్కెట్‌లోకి వస్తున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో లోక్‌సత్తా బృందం రెండు వేల మందికి శిక్షణ ఇచ్చి శాశ్వత ఉపాధి కల్పించగలిగింది. ఈ లెక్కన ఏడాదిలో ఐదువేల మందికి ఉపాధి కల్పిస్తాం. అధికారంలో లేకుండా ఒక్క నియోజకవర్గంలో ఇందరికి శాశ్వత ఉపాధి కల్పించగలిగితే అధికారంలోకి వస్తే చెప్పిందాన్ని తప్పక చేసి చూపిస్తాం. ఒక్కో కేంద్రానికి రూ॥5 నుంచి రూ॥ 7 కోట్లు ఖర్చు చేస్తాం. అలా 15 లక్షల మందికి శిక్షణ ఇస్తే రూ॥2500 కోట్ల వ్యయంతో వారందరికీ ఉద్యోగాలు వస్తాయి.

♦ **వ్యవసాయం లాభసాటిగా చేస్తామని అంటున్నారు? సాగు వ్యయం పెరుగుతున్న తరుణంలో రైతుకు లాభసాటి వ్యవసాయం సాధ్యమా?**

ముందుగా రైతు మీద భారం పెరగకుండా జాగ్రత్తపడాలి. కేంద్రం రైతులకు రూ॥50 వేల కోట్ల రాయితీలు ఇస్తున్నామంటోంది. మేం జాగ్రత్తగా లెక్కిస్తే రూ॥25 వేల నుంచి రూ॥30 వేల కోట్ల మేరకు మాత్రమే రాయితీలు ఇస్తున్నారు. రాయితీలను కొంత మేరకు తగ్గించినా ఆ డబ్బును తిరిగి వ్యవసాయానికి చేరేలా చేయాలి. రైతుకు ఆదాయం పెంచేందుకు యాంత్రీకరణతో సాయపడవచ్చు. దళారులు లేకుండా చెయిన్ మార్కెట్లను ఏర్పాటు చేస్తే వినియోగదారునికి, రైతుకు లాభసాటి అవుతుంది.

♦ **అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు లోక్‌సత్తా ఆవిర్భవించింది... దేశంలో కొనసాగుతున్న అవినీతి వ్యతిరేక పోరులో పార్టీ పంథా ఏమిటి?**

లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఏడు అంశాలను ప్రవేశపెట్టాం. దానిలో కీలకమైంది ఒకటి.. దేశంలో, రాష్ట్రంలో అవినీతిపరుల్ని శిక్షించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఆ సత్తా ఒక్క లోక్‌సత్తాకే ఉంది. బడా అధికారులు, నేతలూ దేశాన్ని నంజుకుతింటున్నారు. అలాంటివారిలో ఏడాదికి 50 మందిని గుర్తించి వారికి శిక్ష పడేలా చేసి, ఆస్తుల్ని జప్తు చేసేలా చట్టాలు చేసేందుకు లోక్‌సత్తా కృషి చేస్తుంది.

♦ **సకల జనుల సమ్మెతో అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్నాయి. దీనికి పరిష్కారం లేదంటారా?**

ఉద్యోగులూ పౌరులే. అయితే వారు పక్షపాత రాజకీయాల్లో పాలుపంచుకోరాదు. ప్రజలకు అర్థం కాని లక్ష్యాలు చెప్పి వారిని ఇబ్బందిపెట్టడం సబబు కాదు. ప్రగతి కుంటుపడకుండా... సమ్మెను విరమించాలి.

♦ **ఐదో వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మీరిచ్చే పిలుపు?**

పేదరికాన్ని ఐదేళ్లలో చాలా వరకు నిర్మూలించగలిగే వనరులు మనకున్నాయి. ప్రజలకు ఆదాయం పెరుగుతోంది. నిరాశకు తావులేదు. ప్రజల ఆకాంక్ష నెరవేరేలాప్రతి ఒక్కరిలో కష్టపడే తత్వం ఉంటే ప్రగతి సాధ్యమవుతుంది. మన బతుకుల్ని సుసంపన్నం చేసుకోవాలంటే మహిళ, యువత, మధ్య తరగతి ప్రజలు ముందుకు రావాలి. లోక్‌సత్తా దానికో నిర్దిష్టమైన ప్రతిపాదికను ముందుకు తేస్తోంది. లోక్‌సత్తా మీ పార్టీ. జాతిని మార్చేందుకు మీరంతా ముందుకు రావాలి. ■

# సంప్రదాయ రాజకీయం సంక్షోభాలకు హేతువే కాని పరిష్కారం కాదు

లోక్‌సత్తా పార్టీ 4వ వార్షికోత్సవం 2010 అక్టోబరు 11న హైదరాబాద్‌లో జరుపుకున్నాం. ఈ సంవత్సరకాలంలో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం మరింత జటిలం అయింది. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మీద జనజీవనం మీద విశేష ప్రభావాన్ని చూపుతున్నది.

**రాజకీయ తీర్మానం**

### 1. కీలక సమస్యలు

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో అధికార, ప్రతిపక్షపార్టీలు ప్రాంతాలవారీగా చీలిపోయాయి. శాసనసభ్యులు, చివరికి మంత్రులు అందులో భాగస్వాములయ్యారు. పర్యవసానంగా పాలన అస్తవ్యస్తం అయింది.

శాసనసభలో ఈ సమస్యను చర్చించాలని అన్ని ప్రాంతాలకీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం చెయ్యాలని లోక్‌సత్తా పార్టీ శాసనసభ్యుడు పదేపదే విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోలేదు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు, కేంద్రప్రభుత్వం ఈ సమస్యను నాన్చుడే గాని తేల్చుడు చేయనందునే పరిస్థితి మరింత విషమించింది.

ఇప్పుడు సకల జనుల సమ్మెతో పరిపాలనతో పాటు ప్రజాజీవనం, ఆర్థిక కార్యకలాపాల స్తంభనకు వచ్చాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా చొరవతీసుకుని ఈ సమస్య పరిష్కారానికి చేస్తున్న ప్రయత్నాలపై తగిన భరోసా ఇచ్చి తాత్కాలికంగానైనా ప్రశాంత పరిస్థితుల ఏర్పాటుకు తగిన చొరవ తీసుకోవాలి.

ప్రజల మధ్య విద్వేషాలకు తావుఇవ్వకుండా ఒక రాజకీయ పరిష్కారాన్ని సాధించడం కోసం అందరూ సంయమనాన్ని, ఇచ్చిపుచ్చుకునే ధోరణిని ప్రదర్శించాల్సిందిగా లోక్‌సత్తా పార్టీ కోరుతున్నది.

### 2. వ్యవసాయ సంక్షోభం :

రాష్ట్రంలో 60శాతం ప్రజల జీవనం వ్యవసాయం మీద ఆధారపడివుంది. ఈ వ్యవసాయరంగం గత దశాబ్దకాలంగా సంక్షోభంలో వుంది. రైతుల ఆత్మహత్యలకు ఆంధ్రప్రదేశ్ అడ్రసుగా మారింది.

రైతుల పంట విరామ ఉద్యమం యీ సంక్షోభానికి ఒక సూచిక, రైతుల ధర్మాగ్రహానికి పరాకాష్ట. ప్రధాన సంప్రదాయ పార్టీలు రైతుకు శాశ్వత ప్రయోజనాలు కలిగించే కీలకసమస్యల్ని విస్మరించాయి. విత్తనాలు, పురుగుమందులు పావలా వడ్డీ, గిట్టుబాటు ధరలచుట్టూ రైతుల్ని తిప్పుతూ పబ్బం గడుపుతున్నాయి. లోక్‌సత్తా పార్టీ మొట్టమొదటి సారిగా లాభసాటి ధర నినాదాన్ని ఇచ్చింది. అమ్ముకునే స్వేచ్ఛ కోసం అన్ని ఆంక్షలు తొలగించాలని సరళీకరణ చేపట్టాలని కోరింది. మద్దత్తు ధరను లాభసాటి ధర చెయ్యాలని డిమాండ్ చేసింది.

ఈ ఉద్యమ ఫలితంగా ప్రభుత్వం ఎగుమతులపై ఆంక్షలని తొలగించింది. ఇది తొలి విజయం మాత్రమే. పార్టీలకు అతీతంగా రైతులంతా ఏకం కావాలని చిల్లర చిట్కాలను పక్కనపెట్టి వ్యవసాయాన్ని లాభసాటి చేసే విధానపరమైన అంశాల సాధనకు ఉద్యమించాలని కోరుతున్నది.

అలాగే వ్యవసాయంలో కౌలుదారుల సంఖ్య పెరిగింది. వారికి రుణసదుపాయం, ప్రభుత్వ పథకాలు వర్తింపజెయాలి. పాత కౌలుదారీ చట్టాన్ని రద్దు చేయకుండా కొత్త చట్టం తెచ్చినా ప్రయోజనం ఉండదని లోక్‌సత్తా స్పష్ట చేసినా ప్రభుత్వం పట్టించుకోనందువల్లే కౌలుదారులకు ప్రయోజనాలు చేకూరడం లేదు. తక్షణమే పాత చట్టాన్ని రద్దు చెయ్యాల్సిందిగా లోక్‌సత్తా పార్టీ కోరుతున్నది.

### 3. యువతకు ఉపాధి నైపుణ్యాలు

వివిధ స్థాయిలలో చదువుకున్న యువతకు నైపుణ్యాలు లేకపోవడం వల్లనే ఉపాధి లభించడంలేదని లోక్‌సత్తా స్పష్టం చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం తాడూబంగరం లేకుండానే యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తానంటూ ఎన్నికల నినాదం చేసింది. తగిన నైపుణ్యాల ఎంపిక, శిక్షణకు ఏర్పాట్లు లేకుండా నేల విడిచిన సాము చేస్తున్నది. ఇది ప్రకటన ఆర్భాటం తప్ప ఉపాధికల్పన మార్గం కాబోదు.

### 4. మద్యనియంత్రణ

రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఒక పక్క మద్య నియంత్రణ

మంత్రాన్ని పఠిస్తూనే మరొకపక్క మద్యాన్ని ప్రభుత్వాలు ఆదాయమార్గం చేసుకుని విచ్చలవిడి మద్యానికి ద్వారాలు తెరిచాయి. ప్రభుత్వానికి ప్రస్తుతం 17 వేల కోట్లు కేవలం మద్యంమీదే ఆదాయంగా ఉంది. ప్రభుత్వ ఘనంగా చెప్పుకునే సంక్షేమ పథకాలను ఈ మద్యం స్వాహాచేస్తున్నది. వారి కుటుంబజీవనాన్ని చిన్నాభిన్నం చేస్తున్నది. మద్యనియంత్రణ ఉద్యమానికి లోక్‌సత్తా పార్టీయే శ్రీకారం చుట్టింది. కాని ప్రభుత్వం మొండిగా, బండగా వ్యవహరిస్తున్నది. దీనిపై ప్రజల్ని చైతన్యపరిచి, మహిళల్ని సమీకరించి ప్రతిఘటించడం తప్ప మరో మార్గం లేకుండా చేసింది.

### 5. స్థానిక ప్రభుత్వాలు

ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో, అభివృద్ధిలో తారతమ్యాలను తొలగించడంలో కీలకపాత్ర పోషించే పంచాయితీలు, మున్సిపాలిటీలను సంప్రదాయపార్టీలు పూర్తిగా విస్మరించాయి. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కేంద్రీకృత పాలనలో ఒకరిని మించి మరొకరుగా వ్యవహరించారు. ఈ ప్రభుత్వం కనీసం స్థానికప్రభుత్వాలకు ఎన్నికలు కూడా జరపకుండా ప్రజాప్రతినిధుల పాలనలేకుండా రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కుతున్నది.

లోక్‌సత్తా పార్టీ మాత్రమే వీటిని స్థానిక ప్రభుత్వాలుగా భావిస్తున్నది. రాష్ట్ర బడ్జెట్‌లో 50% నిధులు కేటాయించాలని తలసరి 1000 రూపాయలు గ్రాంటుగా అందించాలని, జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చెయ్యాలని, చిన్న పట్టణాల అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని కోరుతున్నది.

### 6. అవినీతి

అవినీతి ఇప్పుడు దేశవ్యాపిత ఉద్యమం అయింది. దేశంలో వరుస కుంభకోణాలు, వేల కోట్ల ప్రజాధనం లూటీ కావడంతో అది ఉద్యమ రూపం ధరించింది. పలు స్రవంతులు సాగించిన అవినీతి వ్యతిరేక ఉద్యమాలకు అన్నా హజారే దీక్ష సాధనం అయింది. బలమైన లోక్‌పాల్, రాష్ట్రాలకు వర్తించే లోకాయుక్తల చట్టంలో లోక్‌సత్తా కీలకపాత్ర పోషించింది. బలమైన లోక్‌పాల్ చట్టానికే పరిమితం కాకుండా అవినీతికి కేంద్రబిందువులుగా వున్న ఎన్నికల వ్యవస్థను సంస్కరించడానికి రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాదుకొల్పడానికి తగిన ఉద్యమాలను సాగించాల్సి ఉంది.

అవినీతిలో మన రాష్ట్రం అగ్రస్థానంలో వుంది. ప్రాజెక్టులు, భూపందేరాలు, సెజ్‌లు, పవర్‌పాయింట్లు అన్నింటా వేలకోట్ల అవినీతి ఏరులై పారింది. గనులు, సహజవనరుల కేటాయింపులలో దారి దోపిడీ సాగింది.

లోక్‌సత్తా పార్టీ శాసనసభ్యుడు ఒక్కరే ఉన్నా ఈ అవినీతి భాగోతాలని సభలో ఎండగట్టారు. సభాకమిటీని వేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన కోసం ప్రజా ఉద్యమాన్ని సాగించాలి. అందుకు ప్రజల్ని సమాయత్తం చెయ్యాలి.

ఇవి కొన్ని కీలక సమస్యలు మాత్రమే. వివిధ రంగాల ప్రజలకి, వృత్తుల వారికి, పేదలకి సంబంధించిన అనేక సమస్యలు అలాగే మిగిలివున్నాయి. అందరికీ ఆహారభద్రత సంక్షేమం దక్కడానికి ఏర్పాట్లు జరగాలి. ప్రజల్ని యాచకులుగా మార్చిన ఓటుబ్యాంకు రాజకీయాన్ని తుదముట్టించడమే దీనికి పరిష్కారంగా లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది.

### 2014 ఎన్నికలకు రాజకీయ పెనుగులాట

రాష్ట్రంలో రాజకీయ సంఘర్షణ తెలంగాణ ప్రాంతాల్లో ఒక తీరున, కోస్తా, రాయలసీమలో మరో తీరున సాగుతున్నది. తెలంగాణలో ప్రత్యేక రాష్ట్ర సాధన నేపథ్యంలో రాజకీయ సంఘర్షణ సాగుతున్నది. నినాదం ఒక్కటే అయినా ఉద్యమంలో ఆధిపత్యం కోసం, భవిష్యత్తులో వివిధ వర్గాల పొందిక కోసం అంతర్లీనంగా పార్టీల మధ్య, ప్రజా సంఘాల మధ్య, గ్రూపుల మధ్య పోరుగా అది సాగుతున్నది.

కోస్తా, రాయలసీమలలో 2014లో ఎన్నికల్లో అధికారం కోసం పోరుగా అది రూపుదిద్దుకుంది. మొత్తంమీద సంప్రదాయ రాజకీయ పార్టీలు నాయకత్వ సంక్షోభంలో వున్నాయి. సిద్ధాంతరాహిత్యంలో, విధానపరమైన గందరగోళంలో వున్నాయి. రాష్ట్రంలో సంక్షోభంలో భాగంగా వున్న ఈ పార్టీలు దానిని పరిష్కరించేవిగా లేవు. ఇల్లు తగలబడుతుంటే బొగ్గులేరు కునేవారి చందంగా ఈ పార్టీలు వ్యవహరిస్తున్నాయి. సమస్యలో భాగంగా నువ్వుదొంగ అంటే నువ్వు దొంగ అంటూ పరిష్కారంలో భాగం కాలేని స్థితిలో వున్నాయి. ఇక్కడ జరుగుతున్నది. కేవలం అధికారం పెనుగులాట తప్ప విధానపరమైన సంఘర్షణ కాకుండా పోతున్నది.

ఈ సంవత్సరకాలంలో రాష్ట్ర రాజకీయ రంగం నుండి ప్రజారాజ్యం పార్టీ నిష్క్రమిస్తే, వై.యస్.ఆర్.కాంగ్రెస్ పుట్టుకొచ్చింది. కేవలం గ్లామర్‌తో అధికారాన్ని పొందాలని

ప్రయత్నించిన పార్టీ ఎన్నికల్లో భంగపడగానే అధికార పక్షం పంచన చేరి అంతిమంగా విలీనం అయింది. ఇప్పుడు మరొక పార్టీ వారసత్వంగా అధికారం పొందడం కోసం పుట్టుకొచ్చింది.

**కాంగ్రెస్‌లో నాయకత్వం శూన్యత**

రాజశేఖర రెడ్డి మరణంతో కాంగ్రెస్‌పార్టీలో నాయకత్వ శూన్యత ఏర్పడింది. దీనిని పూరించడానికి కొత్త ముఖ్యమంత్రిని, కొత్త పి.సి.సి అధ్యక్షుణ్ణి నియమించడంతో పాటు ప్రజారాజ్యం పార్టీని విలీనం చేసుకున్నారు. ఇందులో ఏ ఒక్కరూ రాష్ట్ర స్థాయిలో ఆమోదయోగ్యమైన నేతలు కారు పైగా అందరికీ ముఖ్యమంత్రి పదవి మీద ఆశలు గలవారు. ఇది శూన్యతని పూడ్చకపోగా అగాధాన్ని పెంచేదిగానే కనిపిస్తున్నది. కేవలం పాత జనాకర్షణ పథకాలకు కొత్త మెరుగులు దిద్దడం తప్ప ఈ పార్టీ సంక్షోభ పరిష్కారానికి దారి చూపేదికాదు. సమస్యలకు హేతువే కాని పరిష్కారం కాదు .

**విశ్వసనీయతలేని తెలుగుదేశం పార్టీ :**

కాంగ్రెస్ పార్టీలో ఏర్పడిన నాయకత్వశూన్యతని, స్తంభించిన పాలనని ఆసరాగా చేసుకుని తిరిగి అధికారంలోకి రావడానికి, విశ్వప్రయత్నాలు చేస్తున్నది. ఒకపక్క చంద్రబాబు నాయకత్వం బాగా బలహీనపడింది. మరొకపక్క ప్రజల్లో విశ్వసనీయత కలగడం లేదు. అధికారంలో ఒకచేత ప్రతిపక్షంలో ఒక మాటగా వారి వ్యవహారశైలిని పరిగణిస్తున్నారు. ఎన్ని ధర్నాల మీద ధర్నాలు చేసినా, యాత్రల మీద యాత్రలు చేసినా ఇవి ఆ పార్టీకి పూడ్చుకోలేని అంశాలుగా వున్నాయి.

**అవినీతివలయంలో వై.యస్.ఆర్. పార్టీ :**

ఇది వారసత్వం మీద పుట్టినందున దీనికి జగన్ ఏకైక నాయకుడు. పైగా ఆయనే ఈ పార్టీకి అన్ని హంగులు సమకూరుస్తున్నారు. ఆ పార్టీ వై.యస్.ఆర్. కుటుంబం, ఆయన అనుచరుల చుట్టూ ఏర్పడింది. అదే ఆయన బలం, బలహీనత కూడా. పేదల సానుభూతిని చూరగొనడానికి ఓదార్పు యాత్రలలో ఉదరగొడుతున్నాడు. సానుభూతిపవనం మీద ఆశ తప్ప అధికారం పొందాలన్న కాంక్ష తప్ప ఎలాంటి సిద్ధాంతాలు, విధానాలు అక్కడ లేవు. ఆయన ఇప్పుడు అవినీతివలయంలో చిక్కుకున్నారు. అడ్డదారులలో సంపాదనల మీద విచారణలు సాగుతున్నాయి. ఇవన్నీ ఒక కొలిక్కి వస్తేగాని ఆయన రాజకీయ భవితవ్యం తేలదు.

**తెరాసా :** ఉపప్రాంతీయ పార్టీగావున్న తెలంగాణా రాష్ట్ర సమితి ఏకవాక్య కార్యక్రమంతో కార్యకలాపాలు సాగిస్తున్నది. ఆర్థిక, రాజకీయ సామాజిక అంశాలపై అడపాదడపా ప్రకటలను తప్ప తనదంటూ ఒక అభివృధి నమూనాను ఈ పార్టీ ప్రకటించలేదు.

ఇక వామపక్షాలతో సహా మిగిలిన పార్టీల ప్రభావం రాష్ట్ర రాజకీయాల మీద ప్రత్యేకంగా లేదు. ఎందుకంటే వారు అంతిమంగా ఏదో ఒక కూటమిలో భాగస్వాములుగా ఉండడం పరిపాటి అయింది. జాతీయపార్టీగా ఉన్న బిజెపి తెలంగాణాలో కొంత బలాన్ని కలిగి వున్నా రాష్ట్ర రాజకీయాన్ని ప్రభావితం చేసే స్థితిలో లేదు.

**2014 ఎన్నికలు**

ఒక పక్క దేశంలో, రాష్ట్రంలో అవినీతికి వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న నిరసనలకి, రైతులు, యువత వివిధ తరగతుల ప్రజలు సాగిస్తున్న ఉద్యమాలకీ నిజమైన పరిష్కారం సంప్రదాయ రాజకీయ పార్టీల అధికార పెనుగులాటలో లేదనేది స్పష్టం.

రాష్ట్రంలో అవినీతిరహిత పాలకీ, రైతాంగ సమస్యల పరిష్కారానికీ, యువతకి ఉజ్వల భవిష్యత్తుని, కఠిన మద్యనియంత్రణనీ, స్థానిక ప్రభుత్వాల సాధికారతని సాధించే వేదిక అవసరం. అలాంటి వేదిక నిర్మాణానికి లోక్‌సత్తా శక్తి వంచన లేకుండా తన వంతు కృషి సాగిస్తుంది. ఇలాంటి విశాల ప్రజాస్వామిక ప్రత్యామ్నాయ వేదికలో రైతులు, యువత, మహిళలు, వివిధ సంస్థలు రాష్ట్ర ప్రయోజనాల పట్ల ఆసక్తి గల వ్యక్తులు పెద్దలు ముందుకు రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నది. 2014 ఎన్నికలను సంప్రదాయ పార్టీల అధికార పోరుస్థానంలో ప్రజాప్రత్యామ్నాయంతో పోరుగా మార్చాల్సి ఉంది. ఈ ప్రయత్నాలలో అందరిని కలసి రావలసిందిగా కోరుతున్నది. ■


**స్వీకారం**



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**

**చందారేట్లు**

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 10.00 |
| సంవత్సరం | రూ. 120.00 |

**చిరునామా :**

**చైతన్యం, సామాజిక విలువల మాసపత్రిక**

నెం.903, రాయల్ పెవీలియన్, బిగ్ బజార్ ఎదురు రోడ్డు,
గణపతి ఆలయం దగ్గర, అమీర్‌పేట హైదరాబాద్ 500 016

# ఆదివాసీల "స్వేచ్ఛాగీతం" కొమరం భీం

## భూమి కోసం, భుక్తికోసం, ఆదివాసిల విముక్తికోసం, జల్, జంగల్, జమీన్ ఉద్యమం

భారత దేశంలో ఆదివాసిల హక్కుల సాధన కోసం జరిగిన పోరాటాలు చారిత్రకమైనవి. తెలంగాణ సాయుధ పోరులో ముఖ్యుడైన కొమరం భీం, నిజాం నవాబు నిరంకుశత్వాన్ని, దుర్మార్గాలను వ్యతిరేకిస్తూ వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు. 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో కొండ కోనల్లో ప్రకృతిలో సహజీవనం చేసి ఆదిమ జాతుల వారికి సామాజిక న్యాయం దక్కాలని 1928-1940 వరకు నిజాం నవాబుపై రణభేరి మోగించి- నైజాం సర్కార్ గుండెల్లో రైళ్ళు పరిగెత్తించాడు..



**కొమరం భీం**
**జననం : మార్చి 10, 1900 -**
**మరణం : అక్టోబర్ 16, 1940**

**కొమరం భీం జోడేఘాట్ అడవుల్లో నిజాంసైన్యంతో తలపడి ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందిన ఇంగ్లీష్ తేది గురించి వివాదం ఉంది. తెలుగు విక్రమనామ సంవత్సర బాద్రపద శుద్ధ పూర్ణిమ రోజు చనిపోయినట్లు చరిత్రలో పేర్కొన్నారు. ఈ తెలుగు తిథిప్రకారం ఆయన వర్ధంతిని జరుపుతున్నారు. దాంతో ఇంగ్లీష్ తేదిలు ప్రతి సంవత్సరం తారుమారు అవుతున్నాయి. 1940లో విక్రమనామ సంవత్సరం ఆశ్వీయుజ శుద్ధ పూర్ణిమ అక్టోబర్ 16 న వచ్చింది. ఇంగ్లీష్ తేది ప్రకారం అక్టోబర్ 16 కొమరం భీం వర్ధంతిగా నిర్ధారించారు.**

గిరిజన గోండు తెగకు చెందిన కొమరం భీం అదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ తాలూకాలోని సంకెనపల్లి గ్రామంలో కొమరం చిన్నూ, సోంబాయి దంపతులకు ''మార్చి 10, 1900''లో జన్మించాడు. పదిహేనేళ్ళ వయస్సులో అటవీ శాఖ సిబ్బంది దాడిలో తండ్రి మరణించాడు. అప్పుడు భీం-కుటుంబం కెరిమెరి మండలం సర్దాపూర్‌కు వలస వెళ్ళింది. అక్కడే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న తరుణంలోనే నిజాం అనుయాయుడు 'సిద్ధిఖీ' అనే జాగీర్‌దార్ భీం సాగుచేసుకుంటున్న భూమిని దురాక్రమణ చేశాడు. అక్కడి గోండుల చేత పెట్టిచాకిరి చేయించాడు.

ఈ సంఘటనతో భీం కుటుంబం మరోసారి కలత చెందింది. భీం అంతులేని కోపంతో సిద్ధిఖీని హత్యచేసి, నిజాం పోలీసులకు చిక్కకుండా బలార్షా చందాపూర్ మీదుగా అస్సాం రాష్ట్రం వెళ్ళి తలదాచుకున్నాడు. అక్కడే ఐదేళ్ళ పాటు పత్తి, కాఫీ, తేయాకు తోటలలో కూలిపని చేస్తూ కార్మిక ఉద్యమాలకు సారథ్యం వహించాడు.

1935వ సంవత్సరం కొమరం భీం మహారాష్ట్రలోని పూనాకు చేరుకున్నారు. ఆ సమయంలో స్వాతంత్ర్యోద్యమం ఉధృతంగా సాగుతుంది. ఒకే జాతి పక్షులన్నీ ఒక్క చోట చేరుతాయన్నట్లు పూనాలోని స్వాతంత్ర్య సమరవీరులతో కొమరం భీం చేయి కలిపాడు. చదవడం, రాయడం నేర్చుకున్నాడు. తన రహస్య వార్తా హరుడు, మిత్రుడు కోమరం సూరు ద్వారా రాజకీయ పరిస్థితులను ఆకళింపు చేసుకొని తమ ప్రాంతం చేరుకున్నాడు.

స్వాతంత్ర్యం కోసం విశాఖ ప్రాంతంలో 'అల్లూరి సీతారామ రాజు' సాగించిన మన్యం పోరాటాన్ని, బీహార్‌లో, అదివాసుల స్వేచ్ఛ కోసం 'బిర్సాముండా' పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని నిజాం నిరంకుశ పాలనపై భీం కదంతొక్కాడు. ఆ రోజుల్లో పశువుల మేత, వంటచెరుకు తెచ్చుకున్నందుకు 'బంబ్‌రాం', 'దూపపెట్టి' పేర్లతో శిస్తులు వసూలు చేసేవారు. వస్తుమార్పిడి తప్ప డబ్బు కళ్ళ జూడని ఆదివాసీలపై నిజాం సర్కార్ కర్కశంగా వ్యవహరించింది. తమ జాతి స్వేచ్ఛ హక్కుల కోసం భీం చేసిన గంభీరమైన ప్రసంగాలకు ఆదివాసీలు ఆకర్షితులయ్యారు.

ఆసిఫాబాద్ పరిసర ప్రాంతంలోని జోడేఘాట్, పట్నాపూర్, బాబేఝురీ, టోకెన్నావాడ, చల్‌బరిడి, శివగూడ, భీమన్‌గొంది, కల్లెగావ్, అంకుశాపూర్, నార్సపూర్, కోశగూడ, లైన్ పటల్ అనే 12 గ్రామాల భూ పోరాటానికి రాజ్యంగా

ప్రకటించుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేశాడు. ఒకసారి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపినా సఫలం కాలేదు. దరఖాస్తు రాసుకొని నవాబుకు తెలపడానికి హైదరాబాద్ వెళ్ళాడు. కాని నవాబును కలవనివ్వకుండా అధికారులు భీంను అడ్డుకున్నారు. ఇక సాయుధ పోరాటమే శరణ్యమని భావించి, ఆదివాసి గిరిజనులను సమీకరించి గెరిల్లా పోరాటంలో సుశిక్షితులను చేశాడు. దట్టమైన-అడవి గల జోడేఘాట్ గుట్టలను కేంద్రంగా చేసుకొని 'గెరిల్లా యుద్ధం' ప్రారంభించాడు. నిజాం నవాబు సైన్యంపై, అటవీ సిబ్బందిపై కొదమ సింహంలా గర్జించాడు. ఆ సంఘటనతో నివ్వెరపోయిన నిజాం సర్కార్ గెరిల్లా సైన్యంపై దాడులు చేసి, భీం సహచరులైన కొమరం సూరు, లచ్చు పటేల్‌ను నిర్బంధించింది. సాధారణ గిరిజనులను సైతం జైల్లో పెట్టింది. అయినా భీం రాజీ పడలేదు.

**చివరకు జోడేఘాట్ అడవుల్లో హూరాహూరీగా జరిగిన ఎదురు కాల్పుల్లో కోమరం భీం అక్టోబర్ 16, 1940 తిథి ప్రకారం - విక్రమనామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజు వీర మరణం పొందాడు. కొమరం భీం నిజాం నిరంకుశత్వాన్ని ధిక్కరించిన కొదమ సింహం. భీం అంటే గోండు నాయకుడే కాదు, ఆదివాసీల ఆశాజ్యోతి. ఉద్యమలడాయి, తుడుంమోత, భీం అంటే గోండు వీరుడే కాదు, సామాజిక న్యాయ పోరాటాలకు మార్గ దర్శకుడు. గిరిజన హక్కుల పోరాటాలకు ఆయన త్యాగం ఒక స్ఫూర్తి. ఎప్పటికి కొమరం భీం ఆదివాసీల స్వేచ్ఛాగీతం.** ■

**గిరిజన సమస్యలను అధ్యయనం చేసిన**

# హైమండార్ఫ్

**కొమరం భీం చేసిన "జల్ జంగల్ జమీన్" ఉద్యమం ఆయన హత్యతో సమాప్తం కాలేదు.**

ఈ అశాంతికి కారణాలను విశ్లేషించి, తగు సూచనల నివ్వవలసిందిగా అప్పటి నిజాం ప్రభుత్వం, లండన్ విశ్వవిద్యాలయంలో మానవశాస్త్ర (Prof. Christoph von Furer` Haimendorf) విభాగాధ్యక్షుడైన హైమాండార్ఫ్‌ను కోరింది. పరిశీలన కోసం వచ్చిన మనిషి, గోండుల దైన్యాన్ని చూసి, కరిగిపోయి, ఆ సమస్యల పరిష్కారాన్ని అన్వేషిస్తూ, మార్లవాయి గ్రామంలో ఏళ్ళ తరబడి ఉండిపోయాడు. ఆయన పుణ్యమా అని, గోండులకు భూమిపై హక్కు, పట్టాలూ లభించాయి. వారి అభివృద్ధికై ప్రప్రథమంగా చట్టాలు చేయబడ్డాయి. ఈ ప్రాంతాలలో వడ్డీ వ్యాపారం క్రమబద్ధం అయింది.

ఆయన సతీమణి ఎలిజిబెత్ బర్నార్డో (బేట్టీ), లండన్‌లో పుట్టిపెరిగినా, తన భర్తతో పాటు 1940 నుండి ఏళ్ళ తరబడి ఆదిలాబాద్ అడవుల్లో కాలినడకన, గుర్రంమీద తిరుగుతూ హైమాండార్ఫ్‌కు పరిశోధనలో తోడ్పడింది. ఆదివాసుల సమస్యలను మాతృదృష్టితో అవగాహన చేసుకొని, ఆ సమస్యల పరిష్కారానికి పై అధికారులకు రాసింది. ఆమె 1987లో హైదరాబాదులో చనిపోయింది. "నాకూ, ఆవిడకూ అర్థవంతమైన జీవితం గడిచింది గోండుల మధ్యే. మేము కలిసి నివసించిన మార్లవాయి గ్రామంలో గోండుల ఆచారాల ప్రకారమే ఆమె అంత్య క్రియలు జరగాలని హైమాండార్ఫ్ అన్నాడు.



గోండులలో 'మెస్రం' వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా దేవత. నాగోబా దేవాలయం ఆదిలాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో ఉంది. ప్రతియేటా యీ నాగోబా జాతర జరుగుతుంది. కొండలు, కోనలు దాటి వచ్చే గిరిజనుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జాతరల "దర్బార్" ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ హైమాండార్ఫ్ అనుకొని, మొదట 1946లో దర్బార్‌ను నిర్వహించాడు. స్వాతంత్రం వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. జాతర చివరి రోజున జరిగే ఈ దర్బార్‌కు గిరిజన పెద్దలు, తెగల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారు. ప్రొఫెసర్ హైమాండార్ఫ్ మొత్తం మూడు పుస్తకాలను వ్రాశాడు.

1. దిగోండ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ : ట్రెడిషన్ అండ్ ఛేంజ్ ఇన్‌యాన్ ఇండియన్ ట్రైబ్ (1979 ఢిల్లీ, లండన్).
2. ఎ హిమాలయన్ ట్రైబ్ ఫ్రమ్ క్యాటిల్ టు క్యాష్ (1980, ఢిల్లీ, బెర్కెలీ).
3. ట్రైబ్స్ ఆఫ్ ఇండియా : దస్ట్రగుల్ ఫర్ సర్వైవల్ (2000).

సమాచార సేకరణ :

**బండారు రామ్మోహన్ రావు**

# సిసలైన హైదరాబాదీ...గౌర్!

**- దేవులపల్లి అమర్**

**1948** ఏప్రిల్-మే నెలల్లో ఒక రోజున కమ్యూనిస్టు పార్టీ నగర సమితి సుల్తాన్‌బజార్ ప్రాంతంలోని హన్మత్‌గంజ్ దగ్గర ఒక బహిరంగ సభ ఏర్పాటు చేసింది. సహజంగానే అది నైజాం పాలనను వ్యతిరేకిస్తూ ఏర్పాటైన సభ. బూర్గుల నర్సింగరావుగారు ఆ సభ నిర్వాహకుడు. అజ్ఞాతంలో నుంచి ఒక 30 ఏళ్ల యువకుడు హఠాత్తుగా ఆ సభలో ప్రత్యక్షమై ప్రసంగించాడు. ఆయన ఉపన్యాసం పూర్తి కాగానే అరెస్టు చేయడం కోసం ఎదురుచూస్తున్న పోలీసుల కన్నుగప్పి పారిపోయాడు.



**డా॥ రాజ్‌బహదూర్ గౌర్**

ఆయన సిసలైన హైదరాబాదీ కమ్యూనిస్టు నాయకుడు డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్. వృత్తి రీత్యా వైద్యుడు, ప్రవృత్తిరీత్యా విప్లవకారుడు, పార్టీ ఆదేశానుసారం ట్రేడ్ యూనియన్ నాయకుడు. సాహితీవేత్త, ఉర్దూ సాహిత్యాభిమాని, కామ్రేడ్ మఖ్దూమ్‌కు అత్యంత సన్నిహిత సహచరుడు, హాస్యప్రియుడు రాజ్‌బహదూర్ గౌర్ శుక్రవారం తన 94వ ఏట హైదరాబాద్‌లో కన్నుమూశాడు.

ఆయన జైలుకు వెళ్లారు. కొండకోనల్లో అజ్ఞాత జీవితం గడిపారు. పార్లమెంట్‌లో ప్రసంగాలూ చేశారు. తెలంగాణ ప్రజల విముక్తి కోసం వైద్యవృత్తినే వదులుకున్నారు. విస్తారమైన తన కార్యరంగం ద్వారా హైదరాబాద్ నగర చరిత్రలో అంతర్భాగంగా మిగిలిపోయారు.

ఆయన కలుపుగోలుదనం ఎందరినో ప్రజా ఉద్యమాలకు దగ్గర చేసింది. ఫలితంగా చాలా మంది హృదయాల్లో 'గురూ'గా తిష్ఠవేశారు.

ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన కాయస్త కుటుంబంలో జన్మించిన రాజ్ బహదూర్ ఉర్దూ భాషనూ సాహిత్యాన్ని అపారంగా ప్రేమించారు. అభిమానించారు. ఇక్బాల్, ఫైజ్ అహ్మద్‌ఫైజ్, ఫిరాక్ గోరఖ్‌పురి ఆయన అభిమానించే కవులు. ఆ ముగ్గురి కవిత్వం మీదా ఎందరో విశ్లేషణలు చేసినా ఆయన విమర్శనాత్మకంగా రాసిన వ్యాసాలకు అవి సాటిరావు.

హైదరాబాద్ నగరాన్ని ఆయన అమితంగా ప్రేమించారు. ఆ నగరం సుసంపన్నమైన సంస్కృతిని ప్రేమించారు. 1900-1950 మధ్యకాలంలో హైదరాబాద్‌లో ఉర్దూ సాహిత్యంలోని వివిధ ధోరణుల మీద, హైదరాబాద్ నగరం నాలుగు వందల ఏళ్ల ఆస్తిత్వం మీద, తెలంగాణ సాయుధ పోరాటం ముందుకు తెచ్చిన భూమి సమస్య మీద, తెలంగాణ నుంచి విప్లవ సందేశాన్ని పాకిస్థాన్‌కు మోసుకుపోయిన నసీర్ మీద రాజ్‌బహదూర్ రాసిన వ్యాసాలు ఆయన హైదరాబాద్‌ను ఎంత ప్రేమించేవారో స్పష్టం చేస్తాయి.

1918, జూలై 21న ఆయన హైదరాబాద్ పాతబస్తీ గాలిపురాలో జన్మించారు. తల్లిదండ్రులు రాయ్ మహబూబ్‌రాయ్, అమరావతీ గౌర్. ఆయన తాతగారు రాయ్ హరిప్రసాద్ గౌర్. ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లా కిషన్‌పురా గ్రామం నుంచి హైదరాబాద్ వలస వచ్చారు.

పుస్తకాల మీద ప్రేమతో బడిలో చదువుకునే రోజుల్లోనే స్కాలర్‌షిప్ డబ్బులతో పుస్తకాలు కొని గౌలిపురాలో ఒక రీడింగ్ రూమ్ నడిపేవారు. ఆ క్రమంలోనే ఆయనకు మున్షీ ప్రేమ్‌చంద్, హస్రత్ మోహానీ గాలిబ్, ఇక్బాల్ వంటి గొప్ప రచయితల

రచనలతో పరిచయం ఏర్పడింది. ఎం.ఎన్.రాయ్, జయప్రకాష్ నారాయణ్, అశోక్ మెహతా వంటి పెద్దలు రాజకీయాల మీద చేసిన వ్యాఖ్యానాలను కూడా ఆయన అలహాబాద్‌లోని సోషలిస్టు బుక్ క్లబ్ నుంచి తెప్పించుకుని చదివేవారు.

అశోక్‌మెహతా నడిపిన పత్రిక 'కాంగ్రెస్ సోషలిస్ట్' ఎం.ఎన్.రాయ్ 'ఇండిపెండెంట్ ఇండియా', ఉర్దూ సాహిత్య పత్రిక 'నిగార్' తెప్పించుకుని చదివేవారు.

ఆయన రాసిన మొట్టమొదటి రాజకీయ వ్యాసం ఉర్దూ దినపత్రిక 'పయామ్'లో ప్రచురితమైంది. 'ఇస్ తరహ్ ఔర్ క్యూం' అన్న శీర్షికన స్వాతంత్ర్య పోరాటం అహింసా పద్ధతిన నడవడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నించారాయన.

విద్యార్థి ఉద్యమంలో రాటుదేలిన రాజ్‌బహదూర్ కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. అజ్ఞాత జీవితం గడిపాడు, జైలు పాలయ్యాడు. ఖైదు నుంచి పారిపోవడం వంటి సాహసాలూ చేశాడు.

మఖ్దూమ్ మొహియుద్దీన్, జవాద్ రజ్వీ, కె.ఎల్.మహేంద్రలతోకలిసి ఆయన హైదరాబాద్ రాష్ట్రంలో బలమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు. సింగరేణి, ఏపీఎస్ ఆర్టీసీ, ఐడీపీఎల్, వైద్య ఆరోగ్య విభాగం అనేక పబ్లిక్ రంగ బ్యాంకుల్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి అంకురార్పణ చేసిన ఖ్యాతి ఆయనకే దక్కుతుంది.

పోలీస్ చర్య తరువాత రాచకొండ గుట్టల్లో పట్టుబడిన గౌర్‌ను వరంగల్‌లోని నంజప్ప క్యాంప్‌లో చిత్రహింసలకు గురిచేసి నల్లగొండ, సికింద్రాబాద్, హైదరాబాద్ జైళ్లకు తరలించారు.

అదే కాలంలో ఆయనతోబాటు మఖ్దూమ్, బద్దం ఎల్లారెడ్డి తదితరులు జైల్లో ఉన్న కాలంలోనే సాయుధ పోరాటం కొనసాగించాలా? లేదా? అనే అంశంపై అభిప్రాయం తెలుసుకోవడానికి ఎ.కె.గోపాలన్, జ్యోతిబసు, ముజఫర్ అహ్మద్ జైలుకు వెళ్లి వారితో చర్చలు జరిపారు.

రావి నారాయణరెడ్డి మార్గదర్శకత్వంలో సాయుధ పోరాటం విరమించాలని నిర్ణయించిన కమ్యూనిస్టు పార్టీ 1952 ఎన్నికల్లో పాల్గొనడానికి సిద్ధపడింది. అప్పుడాయన జైల్లో ఉన్నారు. అక్కడి నుంచే ముషీరాబాద్ నియోజక వర్గం నుంచి పోటీకి నామినేషన్ దాఖలు చేశారు. కానీ ఓటర్ల జాబితాలో పేరు లేని కారణంగా పోటీ చేయలేకపోయారు.

అయితే రాజ్యసభకు ఎన్నికైన 1952 మే 13న విడుదలయ్యారు. తిరిగి 1956లో రెండోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1962లో మూడోసారి రాజ్యసభకు వెళ్లే అవకాశం వచ్చినా రాజ్‌బహదూర్ తిరస్కరించారు.

> **విద్యార్థి ఉద్యమంలో రాటుదేలిన రాజ్‌బహదూర్ కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. అజ్ఞాత జీవితం గడిపాడు, జైలు పాలయ్యాడు. ఖైదు నుంచి పారిపోవడం వంటి సాహసాలూ చేశాడు. మఖ్దూమ్ మొహియుద్దీన్, జవాద్‌రజ్వీ, కె.ఎల్.మహేంద్రలతో కలిసి ఆయన హైదరాబాద్ రాష్ట్రంలో బలమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు. సింగరేణి, ఏపీఎస్ ఆర్టీసీ, ఐడీపీఎల్, వైద్య ఆరోగ్య విభాగం, అనేక పబ్లిక్ రంగ బ్యాంకుల్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి అంకురార్పణ చేసిన ఖ్యాతి ఆయనకే దక్కుతుంది.**

1962లో మజ్లిస్ అధినేత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీకి వ్యతిరేకంగా షాలిబండ నుంచి శాసనసభకు, 1978లో పి.శివశంకర్‌కు వ్యతిరేకంగా సికింద్రాబాద్ నుంచి పార్లమెంట్‌కూ పోటీచేసి ఓడిపోయారు.

1988లో క్రియాశీల రాజకీయాల నుంచి విరమించుకునేంత వరకూ ఆయన జీవితమంతా భారత కమ్యూనిస్టు పార్టీకే అంకితం చేశారు.

డెబ్బయ్యో పడిలో ఆయన రాజకీయ జీవితం చాలించే నాటికి కమ్యూనిస్టు పార్టీలో దాని ట్రేడ్ యూనియన్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. పార్టీ సిద్ధాంత పత్రిక 'కమ్యూనిస్టుజైసా' (ఉర్దూ)కు ఆయన సంపాదకుడు.

ఆయన తొలిపుస్తకం 1947లో 'హైదరాబాద్ మువ్వన్నెల జెండా' శీర్షికన ఆంగ్లంలో వెలువడింది. ఉర్దూలో ఆయన రచనలు 'అదబీ ముతాలే', 'అదబీజైసా', 'అదబీ తన జూర్' పేరిట సంకలనాలుగా అచ్చయ్యాయి. ముల్కీ-నాన్‌ముల్కీ సమస్యపై రాసిన 'ముల్కీ టాంగిల్ ది కమ్యూనిస్టు అప్రోచ్' కార్మికుల అభ్యున్నతి కోరి రాసిన 'వర్కింగ్ క్లాస్ అండ్ ఎమర్జెన్సీ' ఆయన రచనా వైవిద్యాన్ని చాటి చెబుతాయి. తన ప్రియ మిత్రుడు, కవి మఖ్దూమ్‌పై ఆయన రాసిన 'జ్ఞాపిక' దేశవ్యాప్తంగా ఎందరో పాఠకులకు మఖ్దూమ్‌ను చేరువచేసింది.

అజ్ఞాతంలో ఉండగానే ఆయన సహచరురాలు బ్రిజ్‌రాణిని వివాహమాడారు. జైలు జీవితం, అజ్ఞాత జీవితం రెండింటా ఆమె ఆయన వెన్నంటే ఉన్నారు.

హైదరాబాద్ నగరాన్నే శ్వాసించి దాని అపురూపమైన

సంస్కృతిని ప్రేమించి అక్కడి భాషనూ, మనుషులనూ అమితంగా అభిమానించిన సిసలైన హైదరాబాద్ రాజ్‌బహదూర్ జ్ఞాపకాలను అక్షరరూపంలో పదిలపరచలేక పోవడం పెద్ద లోటు.

సోషలిస్టు భావాల పట్ల ఆకర్షితులైన యువకులు కొందరు 1939లో హైదరాబాద్‌లో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అది ఆ కాలం నాటి యువతకు అత్యంత స్ఫూర్తిదాయకంగా ఉండేది. కామ్రేడ్స్ అసోసియేషన్‌లో మఖ్దూమ్ మొహియుద్దీన్, రాజ్‌బహదూర్ గౌర్‌ల సాహచర్యం గురించి మాబావు దేవులపల్లి మదన్ మోహన్‌రావు చాలా అపురూపంగా చెబుతుండేవారు. ఆలం ఖుంద్‌మీరీ, బూర్గుల నర్సింగరావు కీలకపాత్ర పోషించిన నాటి కామ్రేడ్స్ అసోసియేషన్ కాలగతిలో కమ్యూనిస్టు పార్టీగా రూపుదాల్చింది.

ఉర్దూ భాషా సాహిత్యాలకు ఎనలేని సేవలు అందించిన గౌర్ హైదరాబాద్‌లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ స్థాపనతో ఉర్దూకు మంచి రోజులు వస్తాయని ఆశించారు. 'అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ' సంస్థకు చిరకాలం అధ్యక్షునిగా ఉన్నారు. ఎంపీగా తాను పొందిన రూ॥3లక్షల పెన్షన్ ఎరియర్స్ మొత్తాన్ని ఇటీవలే 'ఉర్దూ తాలీమీ ట్రస్టు'కు విరాళంగా ఇచ్చారు. ఉర్దూ నేర్చుకునే పేద విద్యార్థులకు ఉపకార వేతనంగా ఇచ్చేందుకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తారు.

మఖ్దూమ్‌నైతే చూడలేకపోయాను కానీ రాజ్‌బహదూర్ గౌర్‌ను చిక్కడపల్లి సూర్యనగర్‌లో ఆయన ఇంట్లో చాలాసార్లు కలుసుకున్నాను. దిగువ మధ్య తరగతికి చెందిన ప్రజలు నివసించే ఆ ప్రాంతంలోని తన ఇంటికి ఆయన 'ఏక్‌చమేలీ కా మండ్వా' అని పేరు పెట్టుకున్నారు. ఆ మాట ప్రజాకవి మఖ్దూమ్ ప్రసిద్ధ ఉర్దూ కవితాచరణం కావడం గమనార్హం. ఆయన జ్ఞాపకాలను భావితరాల కోసం రికార్డు చేయాలన్న నా కోరిక తీరకుండానే రాజ్‌బహదూర్ మరణించారు. కొంత కాలంగా ఆయన పూర్తిగా కదలలేని స్థితిలో ఉన్నారు.

జర్నలిస్టు యూనియన్ నాయకుడు కామ్రేడ్ శ్రీనివాసరెడ్డితో కలిసి సూర్యనగర్ ఇంట్లో చివరి ప్రయత్నం చేసి ఏమైనా మాట్లాడదామని వెళ్లాను. ప్రయోజనం లేకపోయింది. హైదరాబాద్‌నే శ్వాసించి, హైదరా'బాద్'ంతా తనదిగా భావించి, అనుభవించి, పలవరించి తొభై ఏళ్ల పైబడ్డ జీవితాన్ని మహానగరానికే ధారబోసి, అక్కడి మట్టి మీద తన పాదముద్రలను వదిలి వెళ్లిన ఈ సిసలైన హైదరాబాదీని అసలైన జ్ఞాపకంగా మిగల్చడానికి గట్టి ప్రయత్నం తప్పకుండా జరగాలి. ■

**(సాక్షి సౌజన్యంతో...)**

# లోక్‌సత్తా 5వ వార్షికోత్సవం తీర్మానాలు

లోక్‌సత్తా పార్టీ ఐదో వార్షిక వేడుకల్లో భాగంగా నాయకత్వ సదస్సులో పలు తీర్మానాలను ఆమోదించింది.

- ప్రజల మధ్య విద్వేషాలకు తావులేకుండా తెలంగాణ అంశానికి ఒక రాజకీయ పరిష్కారాన్ని సాధించేందుకు అందరూ సంయమనాన్ని పాటించాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిని ప్రదర్శించాలి.
- రైతులంతా పార్టీలకతీతంగా ఏకమయి లాభసాటి వ్యవసాయం నినాదంగా ఉద్యమించాలి.
- వివిధ స్థాయిల్లో చదువుకున్న యువతకు తగిన నైపుణ్యాల కల్పనకు ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలి.
- మద్యపాన నియంత్రణ విషయంలో ప్రజలకు చైతన్యపరచి మహిళలను సంఘటిత పరచాలి. బెల్టుషాపులను నిర్మూలించాలి.
- పంచాయితీలు, పురపాలక సంఘాలను స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించి వాటికి రాష్ట్ర బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలి. తలసరి గ్రాంటు రూ॥వెయ్యికి పెంచాలి.
- స్థానిక ప్రభుత్వాలు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి.
- ఎన్నికల వ్యవస్థను సంస్కరించటానికి రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాదుకొల్పేందుకు తగిన ఉద్యమం సాగించాలి.
- దేశంలో ఆహార ధాన్యాల మార్కెట్‌పై ఆంక్షలు పూర్తిగా తొలగించాలని, రైతులు తమ పంటలను ఎక్కడైనా... ఏ ధరకైనా... అమ్ముకునే స్వేచ్ఛ కల్పించాలి. స్వామినాథన్ కమిటీ నివేదికలు అమలు చేయాలి.
- పాత కౌలు చట్టాన్ని రద్దు చేయాలి. రైతుల భయాన్ని తొలగించేందుకు కొత్తచట్టంపై ప్రభుత్వమే ప్రచారం చేయాలి.

# రాష్ట్రంలో ఆర్జన పెరిగింది,,, మానవాభివృద్ధి ఆగింది

- విద్య, వైద్యాల్లో పురోగతి లేదు
- వెనకబడిన రాష్ట్రాల కంటే వెనకంజ
- జాతీయ సగటు కంటే ఎప్పుడూ కిందే
- నిగ్గుతేల్చిన తాజా మానవాభివృద్ధి నివేదిక

ఆర్థికంగా కొంత పురోగతి ఉన్నా.. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పోల్చినప్పుడు... మన రాష్ట్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది! రాష్ట్రంలో మానవాభివృద్ధి స్థాయి ఏ తీరులో ఉందో అంచనా చేసేందుకు 2008లో తొలిగా 'ఆంధ్రప్రదేశ్ మానవాభివృద్ధి నివేదిక' విడుదల చేశారు. ప్రస్తుతం రెండో నివేదిక ముసాయిదా తయారైంది. ప్రఖ్యాత సామాజిక ఆర్థిక అధ్యయన కేంద్రం (సెస్) ఈ నివేదిక ముసాయిదాను ఇటీవలే ప్రణాళికా శాఖకు అందజేసింది. దీనిపై సంప్రదింపుల అనంతరం తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు. రాష్ట్రంలో మానవాభివృద్ధి వేగం తగ్గిందని నివేదిక విస్పష్టంగా నిర్ధారించింది. ముఖ్యంగా అభివృద్ధి వేగాన్ని చూస్తే.. అత్యంత వెనకబడిన 'బీమారూ' రాష్ట్రాలుగా పేర్గాంచిన బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లు కూడా మనకంటే వేగంగా ముందుకు అంగలేస్తున్నట్టు నివేదిక నిగ్గుతేల్చింది.

## ప్రధాన రాష్ట్రాల్లో మానవ అభివృద్ధి సూచి

| రాష్ట్రం | 1981 | | 1991 | | 2001 | | 2004-05 | | 2009-10 | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | విలువ | స్థానం | విలువ | స్థానం | విలువ | స్థానం | విలువ | స్థానం | విలువ | స్థానం |
| ఆంధ్రప్రదేశ్ | 0.298 | 9 | 0.377 | 9 | 0.416 | 10 | 0.513 | 10 | 0.601 | 9 |
| అస్సాం | 0.272 | 10 | 0.348 | 10 | 0.386 | 14 | 0.527 | 9 | 0.578 | 10 |
| బీహార్ | 0.237 | 15 | 0.308 | 15 | 0.367 | 15 | 0.447 | 15 | 0.500 | 15 |
| గుజరాత్ | 0.360 | 4 | 0.431 | 6 | 0.479 | 6 | 0.564 | 7 | 0.636 | 6 |
| హర్యానా | 0.360 | 5 | 0.443 | 5 | 0.509 | 5 | 0.586 | 5 | 0.648 | 5 |
| కార్ణాటక | 0.346 | 6 | 0.412 | 7 | 0.478 | 7 | 0.544 | 8 | 0.625 | 8 |
| కేరళ | 0.500 | 1 | 0.591 | 1 | 0.638 | 1 | 0.730 | 1 | 0.807 | 1 |
| మధ్యప్రదేశ్ | 0.245 | 14 | 0.328 | 13 | 0.394 | 12 | 0.452 | 14 | 0.535 | 13 |
| మహారాష్ట్ర | 0.363 | 3 | 0.452 | 4 | 0.523 | 4 | 0.611 | 3 | 0.712 | 2 |
| ఒరిస్సా | 0.267 | 11 | 0.345 | 12 | 0.404 | 11 | 0.457 | 13 | 0.516 | 14 |
| పంజాబ్ | 0.411 | 2 | 0.475 | 2 | 0.537 | 2 | 0.630 | 2 | 0.699 | 4 |
| రాజస్థాన్ | 0.256 | 12 | 0.347 | 11 | 0.424 | 9 | 0.473 | 12 | 0.546 | 11 |
| తమిళనాడు | 0.343 | 7 | 0.466 | 3 | 0.531 | 3 | 0.610 | 4 | 0.702 | 3 |
| ఉత్తరప్రదేశ్ | 0.255 | 13 | 0.314 | 14 | 0.388 | 13 | 0.474 | 11 | 0.544 | 12 |
| పశ్చిమబెంగాల్ | 0.305 | 8 | 0.404 | 8 | 0.472 | 8 | 0.570 | 6 | 0.626 | 7 |
| భారత్ | 0.302 | - | 0.381 | - | 0.472 | - | 0.532 | - | 0.604 | - |

## అవసరాలు తీరేనా?

రాష్ట్రానికి సంబంధించి ఈ రెండో మానవాభివృద్ధి నివేదిక మన ముందుకు తెస్తున్న మరో కీలకాంశం- ఆర్థికాంశాల్లో రాష్ట్రం పరిస్థితి మెరుగవుతోంది. ఆదాయ వృద్ధి, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో పురోగతి కనిపిస్తోంది. కానీ మానవాభివృద్ధికి కీలకంగా భావించే విద్య, అక్షరాస్యత, ఆరోగ్యం, వైద్యం వంటి విషయాల్లో మాత్రం మిగతా రాష్ట్రాలతో పోలిస్తే మనం వెనకబడి ఉన్నామని నివేదిక స్పష్టంగా గుర్తించింది. మానావాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ చెప్పుకోతగ్గ మెరుగుదల సాధించింది. అయితే ఇతర రాష్ట్రాల మానవాభివృద్ధి సూచికలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ చాలా రాష్ట్రాల కన్నా వెనుకబడి ఉండటమే కాదు.. స్తబ్దుగా ఎక్కడిదక్కడే నిలిచిపోయింది. అని నివేదిక విశ్లేషించటం గమనార్హం.

## సూచిక మారలేదు.. పోటీలో వెనకబడ్డాం

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా! లేదా? అన్నది కేవలం ఆర్థిక అంశాల ఆధారంగానే నిర్ధారించలేం. అందుకే ఆర్థిక అంశాలతో పాటు జీవన ప్రమాణాలకు కీలక సంకేతాలైన విద్య ఆరోగ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటూ మానవాభివృద్ధి సూచికలను గణించే విధానాన్ని ఐరాస విభాగమైన యూఎన్‌డీపీ 1990లోనే ప్రవేశపెట్టింది. దీనిలో ప్రధానంగా ప్రజల ఆయుర్దాయం, ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలను పరిశీలిస్తారు. దీనికోసం సగటు ఆయుర్దాయం, అక్షరాస్యత రేటు, పాఠశాల నమోదుల రేటు తలసరి ఆదాయం వంటి అంశాలను లెక్కిస్తారు. ఇలా చూసినప్పుడు దేశంలోని 15 ప్రధాన రాష్ట్రాల్లో మన రాష్ట్రం-1981 నుంచీ 9,10 స్థానాల్లోనే నిలుస్తోంది. మానవాభివృద్ధి విలువల్లో పురోగతి ఉంటోందిగానీ, ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు మన పరిస్థితి ఏమంత మెరుగుపడటం లేదు. మన మానవాభివృద్ధి విలువ. ఎప్పుడూ కూడా జాతీయ సగటు కంటే కూడా తక్కువగానే ఉంటోంది.

1981లో మనది 9వ స్థానం. 1991లోనూ అక్కడే ఉన్నాం. 2001 నాటికి మరో స్థానం కిందికి జారాం. 2004-05 నాటికి 10వ స్థానంలో ఉన్న మనం. తాజా 2009-10 మానవాభివృద్ధి సూచికలో 9వ స్థానంలో నిలబడ్డాం. మొదటి నుంచీ మన రాష్ట్రసూచిక జాతీయ సూచిక కంటే దిగువనే ఉంది. అంతే కాదు. మన ఇరుగుపొరుగు దక్షిణాది రాష్ట్రాల కంటే కూడా దిగువనే ఉండటం బాధాకరం.

ఇదే సమయంలో దేశంలోనే అత్యంత వెనకబడిన రాజస్థాన్ వంటి రాష్ట్రాలు కూడా మనకంటే వేగవంతమైన పురోగతిని నమోదు చేయటం ఆరంభించాయి. ముఖ్యంగా మన రాష్ట్రం 2004-05కూ, 2009-10కూ మధ్య మొత్తంగా మానవాభివృద్ధి సూచికలో కొంత పురోగతి సాధించినా... విడి విడిగా చూసినప్పుడు విద్యలో వెనకబడింది. ప్రధానంగా పెద్దల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. ఆరోగ్యం విషయంలో వెనకబడింది. పసిబిడ్డల ఆయుర్దాయ ప్రమాణాల విషయంలో ఇప్పటికీ వెనకబడే ఉందని సూచికలు స్పష్టం చేస్తున్నాయి.

## విద్యలో వెనక నుంచి నాలుగు

మానవాభివృద్ధికి సంబంధించిన కీలక అంశాల్లో ముఖ్యమైనది విద్య ఈ విషయంలో దేశంలోని 23 ప్రధాన రాష్ట్రాల్లో అట్టడుగు స్థానంలో బీహార్ ఉండగా.. మన రాష్ట్రం బీహార్, రాజస్థాన్, జార్ఖండ్‌ల సరసన. అడుగు నుంచి నాలుగో స్థానంలో ఉంది. రాష్ట్రంలో మూడింట ఒకొంతు మంది ఇప్పటికీ నిరక్షరాస్యులే. ఈ విషయంలోనూ రాష్ట్రం జాతీయ సగటు కంటే దిగువనే ఉంది. (జాతీయ సగటు : 74.0 రాష్ట్రం రేటు : 67.7) దేశంలోనే ప్రథమస్థానంలో ఉండే కేరళను పక్కనబెట్టినా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక తమిళనాడులు రెండూ కూడా ఈ విషయంలో జాతీయ సగటు కంటే పైనే ఉన్నాయి.

**నానాటికి తీసికట్టు :** మన రాష్ట్రంలో 80లలో అక్షరాస్యత వృద్ధి రేటు : 14%, అది 90లలో:17%, 2001-2011 మధ్య ఈ రేటు ఎకాయెకి 6.6 శాతానికి (మూడు దశాబ్దాల్లో ఇదే కనిష్ఠం) పడిపోయింది. ■

**ప్రధాన రాష్ట్రాల్లో అక్షరాస్యత రేటు (2011)**

| | | | |
|---|---|---|---|
| కేరళ | 93.9 | **భారత్** (జాతీయ సగటు) | 74.0 |
| ఢిల్లీ | 86.3 | ఒరిస్సా | 73.5 |
| హిమాచల్ ప్రదేశ్ | 83.8 | అస్సాం | 73.2 |
| మహారాష్ట్ర | 82.9 | ఛత్తీస్‌గఢ్ | 71.0 |
| తమిళనాడు | 80.3 | మధ్యప్రదేశ్ | 70.6 |
| ఉత్తరాఖండ్ | 79.6 | ఉత్తరప్రదేశ్ | 69.7 |
| గుజరాత్ | 79.3 | జమ్మూకాశ్మీర్ | 68.7 |
| పశ్చిమ బెంగాల్ | 77.1 | **ఆంధ్రప్రదేశ్** | **67.7** |
| పంజాబ్ | 76.7 | జార్ఖండ్ | 67.6 |
| హర్యానా | 76.6 | రాజస్థాన్ | 67.1 |
| కర్ణాటక | 75.6 | బీహార్ | 63.8 |

# మద్యంమత్తులో జనం
# ఆదాయం జోరులో ప్రభుత్వం

ప్రజలకు మంచినీళ్ళ ప్రాయంగా మద్యం లభిస్తోంది. రాష్ట్రప్రజలు తమ ఆదాయలలో అధికభాగం తాగుడుకే తగలేస్తున్నారు. ఒక్కో వ్యక్తి తలపై రోజుకు గరిష్టంగా రూ॥40లను లిక్కర్‌కు వెచ్చిస్తున్నాడు. ప్రతి నలుగురిలో ముగ్గురు మద్యాన్ని సేవిస్తూ తన ఇళ్ళూ, ఒళ్ళూ గుల్ల చేసుకుంటున్నారు. ఒకచేత్తో రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తోన్న సర్కార్ ఇంకో చేత్తో పేదోడి జేబుకు మద్యం రూపంలో టోపి పెడ్తోంది. రాష్ట్రంలో లిక్కర్ సప్లయి చేస్తోన్న ఏపి బేవరేజెస్ కార్పొరేషన్ మద్యం అమ్మకాల ద్వారా సర్కారుకు కాసుల పంటను పండిస్తోంది. మద్యం వినియోగదారుల సంఖ్య ఎంత పెరిగితే ప్రభుత్వానికి అరవేకు రెవిన్యూ సాధ్యం అవుతుండడంతో మద్యం ఉత్పత్తులను సైతం సర్కారు గణనీయంగా పెంచుకునేందుకు సన్నద్ధం అవుతుతోంది. ఎప్పటికప్పుడు టార్గెట్లను విధిస్తూ ఉద్యోగులను సమాయత్తం చేసి గణనీయంగా అమ్మకాలు పెంచుతోంది. మద్యం అమ్మకాలకు తోడు మద్యం అమ్మకాలపై అమ్మకం పన్ను కూడా ప్రభుత్వానికి వస్తుండటంతో ప్రభుత్వ ఆనందానికి అవధులు లేకుండాపోతోంది.

### తయారీకి, అమ్మకం ధరకు భారీ తేడా...

ప్రయివేటు డిస్టిలరీలు ఉత్పత్తి చేసిన మద్యాన్ని సేకరించి రిటైల్ వ్యాపారం సాగిస్తున్న ఆంధ్రప్రదదేశ్ బెవరేజ్‌స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిబిసిఎల్) వివిధ పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది.

వాస్తవానికి మద్యం తయారీకి అయ్యే ఖర్చు కంటే మద్యంపై వివిధ రూపాల్లో ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులే దాదాపు పదిరేట్లు అధికంగా ఉంటుండడం గమనార్హం. ఉదాహరణకు రూ॥500ల విలువజేసే మద్యం బాటిల్ కింద దాదాపు రూ॥400ల మేరకు పన్నులు ఉంటున్నాయి. బెవరేజెస్ కార్పొరేషన్ వచ్చే ఆదాయం అంతా సర్కారు బొక్కసానికే చేరుతోంది. ప్రభుత్వం మద్యంపై నిర్దేశించిన ప్రివిలేజ్ టాక్స్, సేల్స్ టాక్స్, స్పెషల్ ప్రివిలేజ్ టాక్స్, స్టోర్స్ టాక్స్‌లతో పాటు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పన్నును కూడా విధించింది.

| బెవరేజెస్ కార్పొరేషన్ హోల్‌సేల్ వ్యాపారం వల్ల ప్రివిలేజ్ ఫీజుగా సర్కారు రెవిన్యూ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. | | బెవరేజెస్ కార్పొరేషన్ ప్రభుత్వానికి చెల్లించిన అమ్మకం పన్ను (సేల్స్ టాక్స్) వివరాలు ఈవిధంగా ఉన్నాయి. | |
|---|---|---|---|
| ఆర్థిక సంవత్సరం | సర్కారుకు వచ్చిన ఆదాయం (రూ॥కోట్లల్లో) | ఆర్థిక సంవత్సరం | సర్కారుకు వచ్చిన ఆదాయం (రూ॥కోట్లల్లో) |
| 1993-94 | 10.00 | 1993-94 | 12.02 |
| 1994-95 | 42.50 | 1994-95 | 79.25 |
| 1995-96 | 16.22 | 1995-96 | 4.69 |
| 1996-97 | 2.84 | 1996-97 | 1.95 |
| 1997-98 | 100.43 | 1997-98 | 437.93 |
| 1998-99 | 134.00 | 1998-99 | 906.53 |
| 1999-00 | 222.92 | 1999-00 | 1064.65 |
| 2000-01 | 213.05 | 2000-01 | 1137.66 |
| 2001-02 | 222.03 | 2001-02 | 1296.33 |
| 2002-03 | 246.99 | 2002-03 | 1375.81 |
| 2003-04 | 246.50 | 2003-04 | 1410.84 |
| 2004-05 | 286.45 | 2004-05 | 1741.42 |
| 2005-06 | 408.53 | 2005-06 | 1983.80 |
| 2006-07 | 604.18 | 2006-07 | 2516.40 |
| 2007-08 | 1,208.90 | 2007-08 | 3226.19 |
| 2008-09 | 1,605.18 | 2008-09 | 3823.90 |
| 2009-10 | 1821.22 | 2009-10 | 4232.22 |

# ఛవీ రజావత్ : కొత్తతరం నాయకత్వానికి ప్రతీక

- యస్. మనోరమ

ఛవీ రజావత్ (30) సోదా గ్రామానికి సర్పంచ్. ఆ గ్రామం టొంక్ జిల్లా, రాజస్థాన్ రాష్ట్రంలోనిది. జైపూర్‌కి 60 కి.మీ. దూరం. ఆమె మ్యాజిక్ అనే గుర్రం మీద గ్రామంలో తిరుగుతుంటారు. ఒకపక్క చిన్న పిల్లలతో కాసేపు క్రికెట్ ఆడుతుంటారు. మరుక్షణం ఉపాధి హామి పథకం పనులను సీరియస్‌గా పర్యవేక్షిస్తుంటారు. లెవిస్ జీన్స్, రీబాక్ షర్టు ధరించి సంప్రదాయ దుస్తులలో వుండే మహిళలతో కలిసి పనిచేయగల దిట్ట. 100 మంది మహిళలు ఉపాధి హామి పనులలో ఎక్కువ డబ్బు ఇవ్వాలని గొంతెత్తి అరిచినా సంయమనం పాటిస్తుందామె. "పూర్తి పనిచేయండి, పూర్తిగా డబ్బు తీసుకువెళ్ళండని" నిర్మొహమాటంగా చెప్పగల దిట్ట.

ఛవీ తాత రఘుభీర్‌సింగ్ మిలిటరీ అవార్డు మహావీరచక్ర గ్రహీత సోదా గ్రామానికి ఆయన గతంలో మూడుసార్లు సర్పంచ్‌గా సేవలందించారు. ఆ గ్రామం మహిళకి సర్పంచ్‌గా రిజర్వుకాగానే, గ్రామస్థుల కోరిక ప్రకారం ఎయిర్‌టెల్‌లో సీనియర్ స్థాయి ఉద్యోగాన్ని వదిలివేసారామె. పోటీ చేసిన ఇద్దరు మహిళల్ని ఓడించి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయి, గ్రామ అభ్యున్నతికి నడుంకట్టిన 21వ శతాబ్ది యువసర్పంచ్ ఛవీ.

అత్యున్నత విద్యాసంస్థలయిన రుషీవాలీ, అజ్మీర్, శ్రీరామ్ కాలేజీ పూనాలో ఛవీ చదువుకున్నారు. యం.బి.ఎ. పూర్తిచేసి బహుళ జాతి సంస్థ ఎయిర్‌టెల్‌లో చేస్తున్న సీనియర్ స్థాయి ఉద్యోగాన్ని వదిలి జన్మభూమిని బాగుచేయడానికి, అభివృద్ధిని సాధించడానికి నడుంకట్టిన ఆధునిక మహిళా యువసర్పంచ్ ఛవీ రజావత్.

పంచాయితీ పరిపాలన గతంలో జరిగినట్లు చేస్తే, గ్రామ అవసరాలు నెరవేరవని ఆమె గ్రహించారు. సురక్షితమైన నీరు,



రోడ్లు, స్కూళ్ళు, ఎలక్ట్రిసిటీ, మరుగుదొడ్లు, ఉపాధి వంటి మౌలిక అవసరాలు తక్షణ కర్తవ్యంగా గుర్తించి గ్రామస్థుల సహకారంతో మార్పుకి శ్రీకారం చుట్టిందామె. అవినీతిలేని పారదర్శక గ్రామ పంచాయితీలే పాలన లక్ష్యంగా అనేక అంశాలు పై దృష్టిపెట్టడం జరిగింది.

నెలకొకసారి గ్రామసభను ఏర్పాటుచేయడం, ప్రజల అవసరాలు తెలుసుకోవడం వారందరితో సంతకాలు చేయించడం ప్రారంభించిదామె. ఆ విధంగా గ్రామ పరిపాలనలో గ్రామస్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వల్ల అనేక పనులను వారంతటవారే చేసుకోగలిగారు. గ్రామప్రజల అవసరాలు తీరడానికి గ్రామసభ బాగా ఉపయోగపడుతుంది. వర్షాలు లేకపోవడం వల్ల గ్రామంలోని బావులు, నీటి వనరులు మట్టితో పూడుకుపోయాయి. కార్పొరేట్‌రంగంలోని మిత్రుల సహకారంతో డబ్బు సేకరించి గ్రామస్థుల దాహార్తి తీర్చిందామె. గతంలో రేషన్‌షాపు డీలర్ సక్రమంగా సరుకులు ఇచ్చేవాడు కాదు, షాపు తెరిచేవాడు కాదు. పౌరసరఫరా వ్యవస్థ బాగు చేసిందామె.

ఉపాధిహామీ పథకం అమలులో అవినీతికి ఆస్కారం లేకుండా, పారదర్శకంగా సోదాగ్రామంలో ఆమె చేస్తున్న పద్ధతి ఆదర్శప్రాయంగా వుంది. చట్టప్రకారంగా, ఈ పథకం అమలు గ్రామస్థుల ఆర్థిక అవసరాలు తీర్చుతుందనే విషయం ఆదర్శప్రాయం.

రాబోయే 3 సంవత్సరాలలో పేదరికాన్ని తగ్గించి అభివృద్ధి పంథాలో నడిపించడం తన రాజకీయ సంకల్పంగా ఛవీ నిర్ణయం తీసుకుంది.

జస్వంత్‌సింగ్ అనే గ్రామస్థుడు ఆమె జైపూర్ వుంటారు. గ్రామంలో వుండరు అనుకున్నాడంట. కాని ఛవీ వారానికి 5 రోజులు పూర్తిగా పంచాయితీ నిర్వహణలో నిమగ్నమయి వుంటున్నారు. కూతురు విజయవంతంగా పనిచేయడానికి ఆమె తండ్రి నరేంద్రసింగ్ గ్రామంలోనే వుంటూ, సహకారాన్ని అందిస్తూ, ప్రోత్సహిస్తున్నారు. ఉన్నత విద్యనభ్యసించి కార్పొరేటురంగంలో పనిచేసిన ఛవీకి గ్రామ వ్యవహారాలు సవాలువంటివని ఆయనకు తెలుసును.

ఛవీ కుటుంబానికి జైపూర్‌లో హోటల్, గుర్రపుస్వారీ శిక్షణ సంస్థ వున్నాయి. వాటి నిర్వహణకు కూడా ఆమె వారానికి రెండు రోజులు కేటాయిస్తారట. గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేయాలనేది లక్ష్యంగా ఛవీ పనిచేస్తున్నారు. ఈ లక్ష్యసాధనం ప్రధానంగా కావలసింది గ్రామస్థుల ఆలోచనలో మార్పు. వారి భాగస్వామ్యం. అట్టడుగుస్థాయి నుంచి మార్పు ప్రారంభిస్తేనే అభివృద్ధి సాధ్యమని ఆమె నమ్మారు. ఆచరించి చూపుతున్నారు. స్థానికంగా గ్రామస్థులు, కార్యకర్తలు పనిచేస్తేనే ప్రభుత్వ పథకాలు విజయవంతం అవుతాయని నిరూపించి, చూపుతున్నారామె.

ఉన్నత చదువుగల యువమహిళాసర్పంచ్ సోదా గ్రామంలో చేస్తున్న కృషి ఐక్యరాజ్యసమితి దృష్టిని ఆకర్షించింది. ఐరాస ఆధ్వర్యంలో జరిగిన 11వ ఇన్ఫో- పేదరిక ప్రపంచ కాన్ఫరెన్సుకు ఆమెకు ఆహ్వానం అందింది. 2011 మార్చి 24-25 జరిగిన సమావేశాలలో పేదరిక నిర్మూలనలో పౌరసమాజం పాత్ర గురించి ఛవీ సోదాహరణలుగా వివరించి, రాయబారులను, దేశదేశాల అధిపతులను అబ్బురపరిచింది. తన గ్రామ అనుభవాలను ప్రపంచవేదిక మీద అభివృద్ధి నిపుణులతో పంచుకోగలిగింది. అత్యంత ఆధునిక వేషభాషలు గల యువతి భారత్‌లో, అందులో రాజస్థాన్ రాష్ట్రంలో గ్రామ సర్పంచ్ అని ప్రపంచవేదిక అత్యంత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసిందాసమయంలో ఆమె చేస్తున్న కృషికి ప్రపంచవేదిక ప్రముఖులు ఆశ్చర్యపడ్డారు.

ఇటీవలకాలం వరకు ఆమె బయట వారి సహకారం తీసుకోలేదు. కాని ఇప్పుడు తన గ్రామంలో ఐక్యరాజ్యసమితి లక్ష్యంగా పెట్టుకున్న శతాబ్దిలక్ష్యాలు సాధించడానికి విశ్వవేదికను సాయం అందించమని అభ్యర్థించారామె. ఐక్యరాజ్యసమితి భారత్‌తో వున్న సీనియర్ సలహాదారు బాబులాల్‌జైయిన్ సోదా గ్రామ అభివృద్ధికి 'డెప్యూట్' చేసింది. గ్రామంలో బ్యాంకు తెరిచారు. ఛవీ కోరిన మీదట.

ఆధునిక యువతి ఛవీ పంచాయితీ ప్రస్థానమే భారత నిర్మాణానికి పునాదిరాయి. దాపరికం, అవినీతి లేని గ్రామపాలన అంతిమంగా అభివృద్ధిని సాధించగలదు. మహిళలు పరిపాలనలో నిరూపించుకోగల సమర్థులు. రాజ్యాంగం కల్పించిన మహిళా రిజర్వేషన్లు భారత్‌దిశను, దశను మారుస్తాయనే నమ్మకాన్ని ఛవీ లాంటి ఆధునిక యువ మహిళలు వమ్ముచేయరు. సంప్రదాయ గ్రామీణ రాజస్థాన్ గ్రామంలోని ఛవీ చేస్తున్న కృషి మహిళా రాజకీయ సాధికారతకు వెలుగుదివ్వె. ■

# అనంతపురం జిల్లా పార్టీ కార్యకలాపాలు

## మహిళాసత్తా కమిటీ ఎన్నిక

**శింగనమల :** శింగనమల నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ అనుబంధ సంఘం మహిళాసత్తా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎన్.రాఘవేంద్రమ్మ, కార్యదర్శిగా కె.రాజేశ్వరీలను ఎన్నుకున్నామన్నారు. వీరు గత రెండేళ్లుగా పార్టీలో మహిళాసమ్యలపై పనిచేసినట్లు ఆ పార్టీనియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగేంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు నారాయణస్వామి, సరస్వతి, శంకర్, ఓబిలేసు, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతులకు పంట అమ్ముకునే స్వేచ్ఛ ఏదీ

**శింగనమల :** రైతులు పండించిన పంటను విక్రయానికి స్వేచ్ఛలేకుండాపోతోంది. లోక్‌సత్తా పార్టీ నాయకులు ఆరోపించారు. శింగనమలలో రైతు వేదికల మార్గదర్శిని పుస్తకాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నాగేంద్ర రైతులు పంటలను సొంతంగా విక్రయించుకునే అవకాశాలు లేకుండా పోయాయన్నారు. పంటను దళారులకు ఇవ్వాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలను రైతులే పరిష్కరించుకునేందుకు గ్రామాల్లో స్వతంత్ర రైతు సంఘాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. నాయకులు నారాయణస్వామి, జగదీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, శివనారాయణ పాల్గొన్నారు.

## సాగు భూములకు పట్టాలివ్వండి

**శింగనమల :** కొన్నేళ్లుగా సాగు చేస్తున్న భూములను భూపంపిణీ కార్యక్రమంలో పట్టాలు ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రెవెన్యూ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ తరిమెల గ్రామంలో 901 సర్వే నెంబర్‌లో కొన్నేళ్లుగా దళితులు ఈ భూమిని సాగు చేస్తున్నా అధికారులు పట్టాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారన్నారు. దాదాపు 230 మంది ఈ భూమిలో సాగు చేస్తున్న రైతులు ఉన్నారన్నారు. పట్టాల కోసం తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైన అధికారులు స్పందించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌నాయుడు, శ్రీనివాసులు, షబీర్ బాషా, నారాయణస్వామి, రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**రాయదుర్గంటౌన్ :** లోక్‌సత్తా పార్టీ ఐదవ వార్షికోత్సవాన్ని లోక్‌సత్తా నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ తాలుకా అధ్యక్షులు బాబు మాట్లాడుతూ అవినీతిరహిత సమాజ స్థాపన కోసం లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తాపార్టీ నాయకులు అబ్దుల్లా, రియాజ్, లోకేష్, నాగరాజు, తిప్పేస్వామి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దు

**నార్పల :** గ్రామీణప్రాంతాల ప్రజలను జాగృతింపచేయడంలో భాగంగా ప్రచారజాత నార్పలకు వచ్చారు. స్థానిక శివకళాజ్యోతి అవరణంలో బహిరంగ సభను నిర్వహించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు ఈదచెన్నయ్య మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రకటనలతో దగా చేస్తున్నాయని విమర్శించారు. తాను పండించిన పంటను గిట్టుబాటు ధరలేక రాష్ట్రంలో పంటల విరామం (క్రాప్ హాలిడే) ప్రకటించేంత దుస్థితి నెలకొందన్నారు. మద్దతు ధరతో రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలుచేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి అంజనేయులు, శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగేంద్ర, నగర కార్యదర్శి ఇస్మాయిల్, సత్యనారాయణ, రాఘవేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా పార్టీ కార్యకలాపాలు



## ఘనంగా లోక్‌సత్తా వార్షికోత్సవం

**మామిళ్ళగూడెం :** లోక్‌సత్తా పార్టీ 5వ వార్షికోత్సవాన్ని తొలుత గాంధీజయంతి సందర్భంగా మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం పార్టీ జెండాను రవిమారుత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిమారుత్ మాట్లాడుతూ ఈ నెల 8,9 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులో రాష్ట్రపార్టీ ఆధ్వర్యంలో జరిగే 5వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సామినేని రాఘవులు, లింగేశ్వరారావు, బాలస్వామి, రహీం, రమేష్, ఆంజనేయులు, రాంబాబు పాల్గొన్నారు.




## భీమ్‌సింగ్ రైతుల నిరాహార దీక్ష

**జామి :** భీమసింగి చెరుకు రైతులకు చెరకు మద్దతు ధర ప్రకటించాలని బీశెట్టి బాబ్జీ కర్మాగార యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2, ఉదయం భీమసింగి చక్కెర ఫ్యాక్టరీ వద్ద రైతుల సమస్యలపై ఒక్కరోజు నిరాహారదీక్షలో ఆయన పాల్గొన్నారు. రైతు సంఘం ప్రతినిధి పోలిపర్తి అప్పలసత్యం మాట్లాడుతూ రైతులకు ఆర్థిక భద్రత కల్పిస్తూ ప్రత్యేక చట్టం తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. అమలాపురంలో రైతు ఉద్యమానికి సహకరిస్తూ 100 గంటలు నిరాహార దీక్ష చేపడుతున్న ఎర్నేని నాగేంద్రనాద్‌కు తమ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. ఈ దీక్షలో కె.కె.ఎం.రాజు, పి.కె.కె.వి.ఎస్.వర్మ, సుదాకర్, సి.హెచ్.నాగరాజు, పవన్, కళ్యాణ్, రామారావు, వినయ్ పాల్గొన్నారు.




## స్వామినాథన్ సిఫార్సులను అమలుచేయాలి

**ఖమ్మం గాంధీచౌక్ :** రైతు సమస్యలశాశ్వత పరిష్కారానికి స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ స్వతంత్ర్య రైతుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఖమ్మం గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ప్రారంభించారు. గాంధీజయంతి సందర్భంగా తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్రాప్‌హాలిడే ప్రకటించిన ఊట్కూరు రైతులు, స్వతంత్ర్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సామినేని రాఘవులు, గ్రామీణ రైతుస్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు కె.ఆంజనేయులు, లోక్‌సత్తా పార్టీ జిల్లా సెక్రటరీ చింతల లింగేశ్వరరావు, నాయకులు మండిపూడి రామారావు, టి.వెంకటేశ్వరరావు, ఎ.లలితాదేవి, కె.లక్ష్మీనారాయణ, అప్పారావు, కె.అప్పయ్య, రామచంద్రయ్య, ఎ.వేలాద్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పత్తికొండను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**పత్తికొండ :** పత్తికొండ నియోజకవర్గ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనందాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తికొండ ప్రాంతంలో వర్షాభావంతో ఎండుముఖం పట్టిన పంటలను లోక్‌సత్తా బృందం పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్ని పంటలు ఎండిపోయా యన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మండల నాయకులు మాధవరెడ్డి, ప్రసాద్, కాశీం, ఎర్రిస్వామి, కమల నాయక్ పాల్గొన్నారు.

# తూర్పుగోదావరి జిల్లా పార్టీ కార్యకలాపాలు



## లోక్‌సత్తా పార్టీ కాకినాడ నగరశాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం

**కాకినాడ :** కాకినాడ నగరంలో దాదాపు అన్ని డివిజన్లలోనూ ఎన్నో నెలలుగా పెద్ద పెద్ద గుంటలు పడి వాహనాలకు, పాదచారులకు ఎంతో ఇబ్బందికరంగా వున్న రోడ్లను బాగుచేయమని కార్పొరేషన్ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో గాంధీనగర్‌లో లోక్‌సత్తా పార్టీ వినూత్న రీతిలో అధికారులకు రోడ్లు బాగుచేయమని విజ్ఞప్తిచేసారు. దిష్టిబొమ్మను వేలాడిదీసి బొమ్మమెడలో విజ్ఞప్తివున్న ఫలకాన్ని వేసి తమ నిరసనను తెలియజేసారు. లోక్‌సత్తా పార్టీ నగరశాఖ అధ్యక్షుడు నెక్కంటిశ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో డా॥ఆలూరి విజయలక్ష్మి, గంగాధర్‌ప్రసాద్, వాకాటి సుబ్బారావు, కిషోర్‌కుమార్, అడపా శంకర్, పాలడుగు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## బియ్యం ఎగుమతుల అనుమతులు శాశ్వతం కావాలి.

**కాకినాడ :** బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించటానికి ప్రభుత్వం అనుమతించటం హర్షనీయమని, కాని ఈ అనుమతి తాత్కాలికంకాక భవిష్యత్తులో నిలకడగా వుంటుందనే భరోసా రైతులకు వుండాలని డా॥జయప్రకాష్‌నారాయణ్ అన్నారు. ఏంకరేజ్ పోర్టులో ఎగుమతికి సిద్ధంగావున్న బియ్యాన్ని నిలవచేసిన గొడౌన్‌లను ఆయన లోక్‌సత్తా నాయకులతో కలిసి సందర్శించారు. షిప్పింగ్ కంపెనీల ప్రతినిధులు, ఎగుమతిదారులు, లోక్‌సత్తా పార్టీ ఉపాధ్యక్షులు వై.డి.రామారావు, జిల్లా అధ్యక్షురాలు డా॥ఆలూరి విజయలక్ష్మి, నగరశాఖ అధ్యక్షుడు నెక్కంటిశ్రీనివాస్, ఎమ్.శివరామకృష్ణ, గంగాధర్, ప్రసాద్, ప్రకాష్, రాజు, కిషోర్‌కుమార్, రాజ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## 'రబీ'కి నీరందించాలని కలెక్టర్‌తో చర్చలు

కోనసీమలో రబీ పంటకు తగినంత సాగునీటిని తప్పకుండా ఇవ్వడానికి హామీనిచ్చిన జిల్లా కలెక్టర్ శ్రీరవిచంద్రను లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥జయప్రకాష్‌నారాయణ్ అభినందించారు. లోక్‌సత్తా నాయకులతో కలిసి కలెక్టర్ ఆఫీసులో శ్రీరవిచంద్రతో భేటి అయి రైతులకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారాల గురించి చర్చించారు.




**విజయవాడ :** అక్టోబర్ 22, విజయవాడ కార్పొరేషన్‌లో 51వ డివిజన్ కార్యకర్తల సమావేశం జరిగింది. విజయవాడ అర్బన్ జిల్లా అధ్యక్షులు చుండూరి రాజేంద్రప్రసాద్ గారు విచ్చేసి రానున్న మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తమవ్వాల్సిన ఆవశ్యకత కార్యక్రమాల గురించి వివరించి సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేసి కార్యకర్తనుల కార్యోన్ముకులను చేసారు. జిల్లా మహిళాసత్తా ఉపాధ్యక్షురాలు సరళాదేవి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసారు. జిల్లా మహిళాసత్తా కార్యదర్శి వాడేపల్లి శ్రీదేవి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకా డి. రమాదేవి. కల్పన అనురాధ, జి.శ్రీదేవి. అరుణ, జ్యోతి, రమణి, సుశీల, జానకి, విజయలక్ష్మి, అప్పాయమ్మ, రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విషయ పరిజ్ఞానం - సంఘటితం - ఉద్యమం

# లోక్‌సత్తా సాహిత్యం ఆవిష్కరణ

**ప్రజాస్వామ్యంలో ప్రజలను ప్రభువులుగా చేసే క్రమంలో విషయ పరిజ్ఞానాన్ని అందించి సంఘటితంగా ఉద్యమించడానికి లోక్‌సత్తా సాహిత్యం ఉపకరిస్తుంది.**

సంప్రదాయ రాజకీయ పార్టీల సిద్ధాంతం ఒకటే. ఓట్లు సంపాదించడం, పదవులలోకి, అధికారంలోకి రావడం. ఆ తరవాత జనాన్ని దోచుకోవడం. అన్ని పార్టీలు ఒకే తాను ముక్కలై జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటిగా నేటి రాజకీయం నడుస్తుంది. లోక్‌సత్తా పార్టీ ఏర్పడినప్పటి నుండి పార్టీ సిద్ధాంతాలు అచరణ యోగ్యం కావాలంటే వాటిని పార్టీ నాయకత్వం, కార్యకర్తలతో పాటు ప్రజాబాహుళ్యంలోకి విస్తృతంగా వెళ్ళేలా ప్రచారం చేయడానికి పార్టీ సాహిత్యాన్ని వెలువరిస్తుంది.

లోక్‌సత్తా ఉద్యమసంస్థగా మొదలైనప్పుడు రెండవ స్వతంత్ర పోరాటం, ప్రజాస్వామ్యం సంక్షోభం పరిష్కారం, స్వరాజ్యం (ప్రజాహక్కుల పత్రం) పుస్తకాలను ప్రచురించడం జరిగింది.

2006లో లోక్‌సత్తా పార్టీగా ఏర్పడిన క్రమంలో ప్రజలలో రాజకీయాల పట్ల, ప్రజాస్వామ్యం పట్ల మరింత నమ్మకాన్ని కల్పించడానికి నూతనరాజకీయ సంస్కృతి అనే పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది. ఆ తర్వాత పార్టీ ఆవిర్భావ క్రమంలో జనరాజకీయం ఎందుకోసం పుస్తకాన్ని కూడా ప్రచురించాము. 2009 ఎన్నికల సందర్భంగా 50గ్యారంటీల పేరుమీద మరో పుస్తకాన్ని ప్రచురించాము. లోక్‌సత్తా పార్టీ ఐదేళ్ళ ప్రస్తానాన్ని పురస్కరించుకొని ఐదేళ్ళలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్రంలో చేపట్టిన ప్రజాఉద్యమాలను, కార్యక్రమాలను క్రోడీకరిస్తూ ఒక పుస్తకాన్ని విహంగవీక్షణంగా ప్రచురించాము. అలాగే డా॥జయప్రకాష్ నారాయణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో గత రెండున్నర ఏళ్ళుగా జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తూ అసలైన అభివృద్ధికి సిసలైన జవాబుగా మరోపుస్తకాన్ని ప్రచురించాము. 2009 -11 వరకు అసెంబ్లీలో డా॥జయప్రకాష్ నారాయణ్ చేసిన ప్రసంగాలను సంకలనంగా మరో పుస్తకాన్ని ప్రచురించాము. స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య తరపున రైతుల మార్గదర్శి, శిక్షణా కరదీపికను కూడా ప్రచురించడం జరిగింది.

అక్టోబర్ 8,9, 2011న లోక్‌సత్తా పార్టీ 5వ వార్షికోత్సవ సందర్భంగా ఒంగోలులో జరిగిన నాయకత్వ సదస్సులో "లోక్‌సత్తా టైమ్స్" వార్షికోత్సవ సంచికతోపాటు మరో ఏడు పుస్తకాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ పుస్తకాలను ఆవిష్కరించిన, మొదటి ప్రతులు అందుకున్న వారి వివరాలు.

**1. ప్రజాస్వామ్యం సంక్షోభం పరిష్కారం** అనే పుస్తకాన్ని స్థానిక లోక్‌సత్తా పార్టీ నాయకులు గోపాలస్వామి గారు ఆవిష్కరించారు. రాజమండ్రి పట్టణ లోక్‌సత్తా కన్వీనర్ వి.వి.రామారావు మొదటి ప్రతిని అందుకున్నారు.

**2. జేపీ శాసనసభ ప్రసంగాల** పుస్తకాన్ని రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జూపల్లి సత్యనారాయణ ఆవిష్కరించగా రాష్ట్రకార్యదర్శి విజయేందర్ రెడ్డి మొదటి ప్రతిని అందుకున్నారు.

**3. లోక్‌సత్తా టైమ్స్** వార్షికోత్స ప్రత్యేక సంచికను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.డి.రామారావు ఆవిష్కరించగా డా॥ఆలూరి విజయలక్ష్మి, చంద్రకళ, యస్.మనోరమ, డా॥వి.వి.రామారావు, రామకృష్ణారావు, నెక్కంటిశ్రీనివాస్ తదితరులు అందుకున్నారు.

**4. లోక్‌సత్తా పార్టీ @5** పుస్తకాన్ని గ్రేటర్ హైదరాబాద్ లోక్‌సత్తా పార్టీ ఇన్‌ఛార్జి ఎమ్.సత్యనారాయణ ఆవిష్కరించగా మొదటి ప్రతిని మీడియా ప్రతినిధి సురేష్ అందుకున్నారు.

**5. కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి** సంకలనాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జీ శ్రీనివాసన్ ఆవిష్కరించారు. లోక్‌సత్తా నాయకులు రామరాజు, సాంబిరెడ్డి, భవాని తదితరులు అందుకున్నారు.

**6. రైతుల మార్గదర్శి** పుస్తకాన్ని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి పి.భాస్కర్‌రావు ఆవిష్కరించారు. రైతునాయకులు చంగల్‌రాయరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యమ్.విజయకుమార్ అందుకున్నారు.

**7. నూతన రాజకీయ సంస్కృతి** పుస్తకాన్ని లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాజారెడ్డి ఆవిష్కరించగా మొదటి ప్రతిని ప్రకాశం జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు శివరమేష్ రెడ్డి అందుకున్నారు.

**8.జనరాజకీయం** పుస్తకాన్ని యస్.మనోరమగారు ఆవిష్కరించగా డా॥జయప్రకాష్‌నారాయణ్ గారు అందుకున్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని లోక్‌సత్తా ప్రచురణల విభాగం కన్వీనర్ బండారు రామ్మోహన్‌రావు నిర్వహించారు. ■



లోక్‌సత్తా సాహిత్యం
డా॥ జయప్రకాష్ నారాయణ్
శాసనసభ ప్రసంగాలు
2009 - 2011
లోక్‌సత్తా టైమ్స్
సుపరిపాలనకు మరో స్వతంత్ర పోరాటం
కొత్త తరానికి కొత్త రాజకీయం
లోక్‌సత్తా పార్టీ 5వ వార్షికోత్సవం
ప్రత్యేక సంచిక
కూకట్‌పల్లి
జన రాజకీయం
నూతన రాజకీయ సంస్కృతి


























లోక్‌సత్తా పార్టీ
ప్రకాశంజిల్లా
లోక్ సత్తాపార్టీ 5వ వార్షికోత్సవం
లోక్‌సత్తాపార్టీ నాయకత్వ సదస్సు




**JAYARAM AUTOMOBILES**

Main Road, KAKINADA. Phone: 2365878, 2378907, 99129 19575
Sarpavaram Junction, KAKINADA. Phone: 2343458, 96667 79096

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



ఒంగోలులో లోక్‌సత్తా పార్టీ 5వ వార్షికోత్సవం – భారీ ప్రదర్శనలు

ర్యాలీలో అశ్వారూఢుడైన డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad